కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు
గాజువాక, స్టీల్‌ప్లాంట్ ప్రాంతాలకు
విలేఖరులు కావలెను.
సెల్: 8247526179

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 293 విశాఖపట్నం, 08 సెప్టెంబరు 2023 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## విజయనగరం వైద్యకళాశాల ప్రారంభానికి జగన్ : కోలగట్ల



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** విజయనగరం జిల్లా ప్రజల చిరకాల కోరికైన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రానున్నారని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. ఈ నెల 14 లేదా 15వ తేదీన సీఎం పర్యటన ఉంటుందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. సీఎం పర్యటన నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం విజయనగరంలోని తన నివాసం వద్ద ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన విజయనగరం జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అందులో భాగంగానే కొద్ది రోజుల క్రితం భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారని, ఇటీవలే ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో గిరిజన విశ్వవిద్యాలయానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వీటితోపాటు జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయడమే కాక, నేడు తరగతులనూ ప్రారంభించుకున్నామని వివరించారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలోని గాజులరేగ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాలను ప్రారంభించేందుకు

(మిగతా 2లో)

## ఇండో-పసిఫిక్ ఆసియన్ గ్రూప్ అవుట్‌లుక్‌కు భారత్ మద్దతు




రెండ్రోజుల్లో ఇండియాలో జీ-20 సదస్సు ఉన్నా, షెడ్యూల్‌ని అత్యంత బిజీగా ఉంచుకుంటూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాత్రం తన గురువారం ఇండొనేసియాలోని జకార్తాలో పర్యటిస్తున్నారు. అక్కడ ఇవాళ జరిగే 20వ ఆసియన్- ఇండియా సదస్సులో పాల్గొన్నారు. ఇండియా అమలుచేస్తున్న యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియన్ గ్రూప్.. మూల స్తంభం లాంటిది అని మోదీ అన్నారు.

ఇండో-పసిఫిక్ దేశాలపై ఆసియన్ గ్రూప్ అవుట్‌లుక్‌ని పూర్తిగా భారత్ సమర్థిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. "మన భాగస్వామ్యం 4వ దశాబ్దంలోకి ప్రవేశించింది. ఇండియా యొక్క ఇండో-పసిఫిక్ ఇనిషియేటివ్‌లో ఆసియన్ కీలక పాత్ర పోషిస్తోంది" అని మోదీ తెలిపారు.

ఆసియన్ గ్రూపు.. అభివృద్ధికి కీలక కేంద్రంగా ఉందనీ, ప్రపంచ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తోందని మోదీ తెలిపారు. "మన పరస్పర సహకారంలో స్థిరమైన వృద్ధి ఉంది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా మనం కలిసి సాగుతున్నాం" అని మోదీ అన్నారు.

ప్రధాని మోదీ.. ఇండొనేసియా రాజధాని జకార్తాకు గురువారం ఉదయం

(మిగతా 2లో)

## సూర్యుడిపై సెల్ఫీ.. అద్భుతమైన చిత్రాలు తీసిన ఆదిత్య ఎల్-1 మిషన్



సూర్యుడిని పరిశోధించేందుకు భారత్ పంపించిన ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం లక్ష్యం దిశగా విజయవంతంగా ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో ఆకాశం నుంచి ఫొటోలు, సెల్ఫీ పంపించింది ఈ ఉపగ్రహం. ఆకాశం నుంచి తీసిన ఒక ఫొటోలో మన భూగ్రహంతో పాటు తొంగి చూస్తున్నట్టు చందమామ కూడా కనిపించాడు. ఆదిత్య ఎల్-1 అప్‌డేట్స్‌లో భాగంగా ఆ ఫొటోను ఇస్రో షేర్ చేసింది. ఈ సెల్ఫీ ఫొటోలను సెప్టెంబర్ 4న ఆదిత్య ఎల్-1 లోని కెమెరా క్యాప్చర్ చేసింది. ఈ ఫొటోలో ఆదిత్య ఎల్ 1లో ఉన్న విజిబుల్ ఎమిషన్ లైన్ కొరొనాగ్రాఫ్ VELC, సోలా అల్ట్రా వయొలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ -SUIT పే-లోడ్స్ స్పష్టంగా కనిపించాయి. భూమి, చంద్రుడు ఒకేసారి కనిపించిన దృశ్యాలను కూడా ఆదిత్య ఉపగ్రహంలోని కెమెరా క్లిక్‌మనిపించింది. సూర్యుడిని పరిశోధించేందుకు ఆదిత్య ఎల్-1 మిషన్‌ను భారత్ సెప్టెంబర్ రెండున ప్రయోగించింది. భూమి

(మిగతా 2లో)

## ఆదివారం భద్రం పార్కులో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం ఎంవీపీ కోలనీ సెక్టార్-6లో గల ఎంవీ భద్రం పార్కు యందు వెయ్యిమంది హనుమాన్ భక్తులచే 108 మార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని ప్రఖ్యాత వేదాంగ జ్యోతిష్య పండితులు కందాళ వేంకట సత్యశ్యామ్ ప్రకటించారు. ఆరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పారాయణం జరుగుతుందని, భక్తులకు మధ్యాహ్న భోజన ప్రసాదం ఏర్పాటు చేయబడిందని వారు తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణంలో ఆసక్తిగలవారు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆంజనేయస్వామి కృపకు పాత్రులు కావలసిందిగా ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సంఘం ప్రతినిధులు డి.శ్రీనివాస్, ఆదినారాయణ మాట్లాడుతూ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారి అనుగ్రహంతో, వారి ఆదేశాలతో ఏప్రిల్ నెలలో కోటిమార్లు హనుమాన్ చాలీసా పఠించే సత్ సంకల్పం మొదలైందని, ఇప్పటివరకు ఒకకోటి ఇరవైలక్షల మార్లు వివిధ ప్రదేశాలలో అనుబంధంగా ఉన్న భక్తులు హనుమాన్ చాలీసాను పఠించారని, ఇంకా ఎంతోమంది పఠిస్తున్నారని, ఈ పఠనం డిసెంబరు 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. డిసెంబరు 15, 16, 17 తేదీలలో ఎంవీపీ కోలనీలోని ఏబీసీ పార్కు యందు కశింకోట గురువుగారైన బ్రహ్మశ్రీ రేజేటి శ్రీరామాచార్యులు గారి బృందంచే

(మిగతా 2లో)

## రూ.13 కోట్లతో నూకాలమ్మ ఆలయ ఆధునీకరణ : అమర్నాథ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణ పనులకు పనులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ దంపతులు గురువారం అంకురార్పణ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆలయ గర్భాలయాన్ని విస్తరించడంతోపాటు, ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్గా ఉన్న సమయంలో వై వి సుబ్బారెడ్డి మూడు కోట్ల రూపాయలు మంజూరు చేసి, కోటిన్నర రూపాయలు ఇప్పటికే విడుదల చేశారని, మొత్తం కూడా త్వరలోనే అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి కూడా ఆమోదం తెలియజేసిందని మంత్రి అమర్నాథ్ చెప్పారు.

గురువారం ఉదయం అమ్మవారి ఆలయానికి చేరుకున్న అమర్నాథ్ దంపతులను ఆలయ చైర్మన్ కొణతాల మురళి, ఈవో తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి అమర్నాథ్కు పరివేట్టం చుట్టి అమ్మవారి గర్భాలయంలోకి మంత్రోచ్ఛరణలతో తీసుకువెళ్లారు. అమ్మవారి మూలవిరాట్ దర్శనాన్ని గురువారం నుంచి నిలిపివేయనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అమ్మవారికి జరిపిన ప్రత్యేక పూజలు మంత్రి అమర్నాథ్ దంపతులు పాల్గొన్నారు.

కాగా, ప్రధానాలయం మూసివేసి, భక్తులు దర్శనం కోసం బాలాలయంలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. ఇక్కడ కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమర్నాథ్ దంపతులు అమ్మవారికి పట్టుబట్టలు, గాజులు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు అమర్నాథ్

(మిగతా 2లో)

## తిరుమలకొండపై ఆపరేషన్ చిరుతపై టీటీడీ వివరణ



తిరుమల కొండపై ఐదు చిరుతలు చిక్కాయి.. మరి వాటిలో చిన్నారి లక్షితపై దాడి చేసింది ఏ చిరుత? లక్షితపై దాడి తర్వాత నాలుగు చిరుతల్ని అధికారులు బంధించారు. వాటి గోళ్లు, వెంట్రుకల్ని ల్యాబ్‌కి పంపారు. వాటికి సంబంధించిన నివేదికలు రావాల్సి ఉంది. అవి వస్తే.. లక్షితపై దాడి చేసిన చిరుత ఏదన్న దానిపై స్పష్టత రానుంది. ఒకవేళ నాలుగు చిరుతల్లో దాడి చేసిన చిరుత ఉంటే.. జూలోనే బంధించే అవకాశముంది. జూన్ 24 నుంచి ఇప్పటిదాకా మొత్తం ఐదు చిరుతల్ని బంధించారు ఫారెస్ట్ అధికారులు. అధికారులు మొదటినుంచి ఐదు చిరుతలు సంచరిస్తున్నాయని అనుమానిస్తున్నారు. వాళ్లు అనుమానించినట్టే ఐదు చిరుతలు చిక్కాయి. అలాగని ఇంతటితో చిరుతల సంచారం లేదని భావించలేమంటున్నారు అధికారులు.

ఆపరేషన్ చిరుతలో భాగంగా నడకమార్గంలో దాదాపు 300ట్రాప్ కెమెరాలు, అధునాతన బోన్లు ఏర్పాటు చేశారు. ట్రాప్ కెమెరాలను నిరంతరం మానిటరింగ్ చేస్తూ వన్య మృగాల సంచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారు. చిరుతల సంచారాన్ని గుర్తిస్తూ అవి తిరిగే ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేసి సక్సెస్ అయ్యారు. అయితే నడకమార్గాల్లో వన్య ప్రాణుల సంచారాన్ని ఎప్పటికప్పుడు వాచ్ చేస్తూనే ఉంటామంటున్నారు అధికారులు. ఐదో చిరుతను బంధించిన బోను దగ్గర ఆనవాళ్లు సేకరించారు ఐసర్ సైంటిస్ట్ డాక్టర్ నందిని. చిన్నారులు కౌశిక్, లక్షితలపై దాడి చేసింది ఏ చిరుత అన్నది గుర్తించేందుకు నమూనాలు తీసుకున్నారు. శాంపిల్స్ రిపోర్ట్స్‌కి ఐదు రోజుల సమయం పట్టే ఛాన్స్ ఉంది. ఆపరేషన్ చిరుత నిరంతరం కొనసాగుతుందన్నారు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్. మొత్తం 300 మంది సిబ్బంది పాల్గొంటున్నారని.. అధునాతన బోన్లతో చిరుతల్ని బంధించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ఐదు చిరుతలు చిక్కడంతో.. నడకమార్గంలో భక్తులకు ఎలాంటి భయాలు అక్కర్లేదంటున్నారు

(మిగతా 2లో)

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు
పరమ గురువుల దివ్యాశీస్సులతో

కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి వారు
బ్రహ్మర్షి శ్రీశ్రీశ్రీ 1011 బర్ఫానీ దాదాజీ
మాస్టర్ సి.వి.వి. గారు
మాస్టర్ ఇ.కె.గారు
మాస్టర్ ఎమ్.ఆర్.ఎల్.రావు గారు


" హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన "
కార్యక్రమానికి స్వాగతం
బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారి ఆధ్వర్యంలో
శ్రీ కందాళ వేంకటసత్యశ్యామ్, శ్రీమతి అరుణ గాయిత్రి దంపతుల సంకల్పంతో
జరుగుతున్న కోటి హనుమాన్ చాలీసా పారాయణంలో భాగంగా
తేది : 10-09-2023 ఆదివారం ఉదయం 8 గంటల నుండి
శ్రీ ఆకొండి వెంకట్రావు మాస్టారు గారి ఆధ్వర్యంలో
(కీ॥శే॥ ఐ.వి.ఎల్. శాస్త్రిగారి శిష్యులు)
చింతామణి గణపతి భజనమండలి, విశాఖపట్నం వారిచే
(శ్రీమతి పూరుగంటి రత్నమాల, శ్రీమతి ప్రయాగ అన్నపూర్ణ,
శ్రీమతి పుల్లాబట్ల సరస్వతి, శ్రీమతి పుల్లాబట్ల రామలక్ష్మి,
శ్రీమతి సుసర్ల కళ్యాణి, శ్రీమతి కందర్ప భగవతి) గార్ల నేతృత్వంలో

దత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

దత్తపీఠం, ఉత్తర పీఠాధిపతి, శ్రీ విజయానంద తీర్థ స్వామీజీ
భక్తులచే 108 మార్లు హనుమాన్ చాలీసా పఠించబడును.
వేదిక : భద్రం కమ్యూనిటీ హాల్, సెక్టార్-6, యమ్.వి.పి.కోలని, విశాఖపట్నం.
జ్యోతి ప్రజ్వలన
శ్రీమతి గుమ్ములూరి శారదా సుబ్రహ్మణ్యం గారు
( ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసులు)
అందరూ విచ్చేసి ఈ భగవత్ కార్యక్రమంలో పాల్గొని గురుకృప, శ్రీ సీతారాముల అనుగ్రహము మరియు హనుమంతుని ఆశీస్సులు పొందగలరని ఆశిస్తూ....
ఆహ్వాన సంఘం
శ్రీమతి కొడుకుల కృష్ణవేణి
శ్రీ పి. దుర్గారావు గారు
కీ॥శే॥ ఐ.వి.ఎల్. శాస్త్రిగారి శిష్య బృందం
డి.శ్రీనివాస్
వి.వి.ఆదినారాయణ మూర్తి
మారుతి (సువర్చల అభయ మారుతీ పీఠం)
శ్రీమతి తటవర్తి శిరీష శ్రీరామ్
(సంపాదకులు : విశాఖ సమాచారమ్)
వివరములకు :
శ్రీ మతి అరుణ గాయత్రి సెల్: 9160885953
మధ్యాహ్నం 1 గంట నుండి అన్నప్రసాద వితరణ

(మొదటి పేజీ తరువాయిలు)

### విజయనగరం వైద్యకళాశాల ప్రారంభానికి జగన్ : కోలగట్ల

ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సమీపంలోనే బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజయనగరం జిల్లా అంటే ముఖ్యమంత్రి కి ప్రత్యేక అభిమానం ఉందని గుర్తు చేశారు. విద్య, వైద్యానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గిరిజన వర్సిటీ, జేఎన్టీయూ స్థాయి పెంపు, వైద్య కళాశాల మంజూరు ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభమైతే ఇక్కడే అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని, స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. పేదవారికి ఎంతగానో ఇది ఉపయోగపడుతుందన్నారు. విజయనగరం నియోజకవర్గానికి గతంలో జగనన్న వసతి దీవెన పథకం ప్రారంభోత్సవం సందర్భంలోనూ, గుంకలాంలో జగనన్న లేఅవుట్ ప్రారంభానికి ముఖ్యమంత్రి విచ్చేశారని.. ప్రస్తుతం మూడోసారి రానున్నారని తెలిపారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ క్యాడర్ ను సమాయత్తం చేస్తున్నామని కోలగట్ల తెలిపారు.

### ఇండో-పసిఫిక్ ఆసియన్ గ్రూప్ అవుట్‌లుక్‌కు భారత్ మద్దతు

వచ్చారు. ఇండియాకి ఆసియా దేశాలు అత్యంత కీలకమైనవి. ఈ దేశాలన్నీ అభివృద్ధిలో దూసుకెళ్తూ ఉన్నాయి. ఈ దేశాలు ఆసియన్ గ్రూపులో భాగంగా ఉన్నాయి. ఇండియా అభివృద్ధి చెందేందుకూ, ఆలాగే ప్రపంచ దేశాలు వృద్ధి చెందేందుకూ.. ఆసియన్ సదస్సు కీలకంగా వ్యవహరిస్తోంది. అందువల్లే ప్రధాని మోదీ తనకు ఢిల్లీలో.. బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఆసియన్ సదస్సులో పాల్గొనేందుకు జకార్తా వెళ్లారు.

ఇదే కాదు.. ప్రపంచ దేశాల్లో ఎక్కడ కీలక సదస్సులు జరిగినా అక్కడికి మోదీ వెళ్తున్నారు. భారత దేశ ఉద్దేశాలు, సాధిస్తున్న అభివృద్ధిని వివరిస్తున్నారు. శాంతి మార్గంలో ముందుకు వెళ్తామని సూచిస్తున్నారు. అందుకే ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు చైనా కంటే భారత్ బెటర్ అనే ఒపీనియన్‌కి వస్తున్నాయి.

9, 10న ఢిల్లీలో జరిగే జీ20 సదస్సుతో ఇండియా.. ప్రపంచ దేశాల్లో తన వంతు పాత్రను మరింత పెంచుకోబోతోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. అందులో భాగంగానే.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. G20 సదస్సును విజయవంతం చెయ్యడం ద్వారా.. ప్రపంచ దేశాల్లో పెద్దన్నగా ఎదిగేందుకు భారత్ ప్రయత్నిస్తోంది.

### సూర్యుడిపై సెల్ఫీ.. అద్భుతమైన చిత్రాలు తీసిన ఆదిత్య ఎల్-1 మిషన్

నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని సూర్యుడి సమీపంలోని ఎల్-1 పాయింట్‌కు చేరేందుకు ఉపగ్రహానికి 125 రోజుల సమయం పడుతుంది. ఈ ఎల్ వన్ పాయింట్ నుంచి సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేయవచ్చు. ఆదిత్య ఎల్ -1 మొత్తం ఏడు పరిశోధనా పరికరాలున్నాయి. ఇవి సూర్యుడి పొరలతో పాటు వెలుపల ఉండే కరోనానూ కూడా అధ్యయనం చేస్తాయి. సౌరజ్వాలలు, సౌర రేణువులు, సూర్యుడి సమీపంలో ఉండే వాతావరణం వంటి ఎన్నో అంశాలను ఆదిత్య మిషన్ శోధించనుంది. ఆదిత్య ఎల్1 పంపిన వీడియోలో అంతరిక్షం నుంచి భూమి, చంద్రుల దృశ్యం అద్భుతంగా కనిపిస్తోంది. వీడియోలు,ఫోటోలలో భూమి, చంద్రుడు ఒకదానికొకటి చాలా దూరంగా కనిపిస్తున్నాయి. భూమి పెద్దగా కనిపించినా చంద్రుడు చాలా చిన్నగా కనిపిస్తున్నాడు. భారతదేశం తన మొదటి సన్ మిషన్ ఆదిత్య L1ని సెప్టెంబర్ 2న ప్రారంభించిన సంగతి తెలసిందే. ఈ ఉపగ్రహం మొదటి కక్ష్య ప్రక్రియ సెప్టెంబర్ 3న విజయవంతంగా నిర్వహించబడింది. లాగ్రాంజ్ పాయింట్ ఎల్-1 వైపు తరువాతి కక్ష్యలోకి ప్రవేశించే ముందు 'ఆదిత్య ఎల్-1' మరో రెండు కక్ష్య విధానాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఉపగ్రహం దాదాపు 127 రోజుల తర్వాత ఎల్-1 పాయింట్ వద్ద కోరుకున్న కక్ష్యను చేరుకునే అవకాశం ఉంది.

### ఆదివారం భద్రం పార్కులో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన

హనుమత్ కోటి యజ్ఞం నిర్వహించబడుతుందని సుమారు 12 హోమ గుండములతో నిర్వహించబడే ఈ కార్యక్రమంలో హనుమాన్ చాలీసా పఠించినవారందరికీ అవకాశం కల్పిస్తారని తెలియజేశారు.

ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం ప్రారంభమయ్యే ఈ సహస్ర గళార్చన కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామి భక్తులు చింతామణి గణపతి బృందం సభ్యులంతా పాల్గొంటారని, ద్వారకానగర్‌లోని శంకరమఠం కమిటీ మరియు భక్తబృందం కూడా పాల్గొంటారని తెలిపారు.

### రూ.13 కోట్లతో నూకాలమ్మ ఆలయ ఆధునీకరణ : అమర్నాథ్

దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తూ ఉంటారని, వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఆలయ ఆధునీకరణ పనులు చేపట్టామని తెలియజేశారు. ఉగాది నాటికి ఆధునికరణ పనులు పూర్తిచేసి అమ్మవారి దర్శనాన్ని భక్తులకు అందజేస్తామని చెప్పారు.

### తిరుమలకొండపై ఆపరేషన్ చిరుతపై టీటీడీ వివరణ

అధికారులు. భక్తులు ధైర్యంగా కొండపైకి నడుచుకుంటూ వెళ్లొచ్చంటున్నారు. మరోవైపు వన్య మృగాల సంచారం.. ఆందోళన అవసరం లేకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషిస్తోంది టీటీడీ.

ఐదు చిరుతలు చిక్కాయి.. మరి ఎలుగుబంట్ల సంగతేంటి? ట్రాప్ కెమెరాలకు చిరుతలు మాత్రమే చిక్కుతున్నాయి. ఎలుగుబంట్లు ఎందుకు చిక్కడం లేదు? అధికారులు మాత్రం ట్రాప్ కెమెరాల మానిటరింగ్ 24గంటల పాటు ఉంటుందని.. వన్యప్రాణాలు సంచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామంటున్నారు. ఆపరేషన్ చిరుతను కూడా కంటిన్యూ చేస్తామంటున్నారు.

# భారీగా పతనమైన టమాట



మొన్నటి వరకు రూ.200 పలికిన కిలో టమాటా.. నేడు ధరలు లేక రోడ్డుపాలవుతోంది. నంద్యాల జిల్లా ప్యాపిలి టమాటా మార్కెట్ లో ధరలు లేకపోవడంతో రైతులు అక్కడే పారబోసి వెళ్లిపోయారు. వాటిని పశువులు మేస్తూ కనిపించాయి.

ధరలు భారీగా తగ్గిపోయాయని... దీని వల్ల కోత, రవాణా ఖర్చులు సైతం రావటం లేదని రైతులు వాపోతున్నారు. ఏపీలోని అన్ని మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో టమాటా ధర ప్యాపిలిలో 3 రూపాయలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లె మార్కెట్లోనూ టమాటా ధరలు భారీగా పతనమయ్యాయి.

# హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీ .మురళీకృష్ణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సబ్బవరం పిఎస్ లో హోంగార్డు గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సబ్బవరపు కుమారస్వామి భార్య ఎస్.హైమా కు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు వేతనం రూ.3,94,050 చెక్ ను తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చేతుల మీదగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా లలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు వేతనం ను ఆర్థిక సహాయంగా అంద చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

# రానున్నది టీడీపీ ప్రభుత్వమే - దిన్ బాబు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గములో గల రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో గల తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్షులు వసంతవాడ వెంకటేశ్వరరావు (దినుబాబు) ఆధ్వర్యంలో గురువారం నాడు జరిగిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మత్రిపాలెం, మురకాడ, రజాల, దిమిలి,కుమ్మరాపల్లి, కడుబోలు, కొత్తూరు,గోకివాడ, పంచదార్ల,రాజకోడూరు, మూలజంప, గ్రామ టిడిపి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దిన్ బాబు మాట్లాడుతూ ప్రతి వంద ఓట్లకు ఇద్దరు కెఎస్ఎస్ లను, నియమించి జాబితాలను అందించడంతో పాటుగా మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ అనే పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి రాబోవు కాలంలో ఈ పథకాల ద్వారా వారి కుటుంబంలో ఎంతమంది ఏ విధంగా లబ్ధి పొందుతున్నారనేది వివరించి యాప్ నందు అప్లోడ్ చేయాలని సూచించారు.అప్లోడ్ చేసిన వివరాలను మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇంన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావులు పరిశీలిస్తారని అదేవిధంగా రాష్ట్ర ,జిల్లా మండల కమిటీ లోని సభ్యులు తమ గ్రామాలలో జరిగే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంపై ప్రతీ గ్రామంలో ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని త్వరలోనే నియోజకవర్గ నాయకులతో మాట్లాడి రూట్ మ్యాప్ ను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి నాయకులు ప్రతి ఒక్కరూ వందశాతం పూర్తి చేయాలని మీరు చేసే ప్రతి పని కేంద్ర కార్యాలయం పర్యవేక్షణలో ఉంటుందని రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అధ్యక్షులు,కార్యదర్శులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్‌లోనే అతి పొడవైన గాజు వంతెన?



కేరళ అంటే ప్రకృతి అందాలు.. బోటు షికార్లు.. సుగంధ ద్రవ్యాలు, తేయాకు తోటలే గొర్తుకొస్తాయి. ప్రకృతి సోయగాలకు నెలవైన Gods Own Countryని జీవితంలో ఒకసారైనా సందర్శించాలని ఎంతోమంది కోరుకుంటుంటారు. దేశంలో పర్యాటక రంగానికి కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలిచే ప్రదేశాల్లో కేరళ ప్రధాన కేంద్రంగా వర్థిల్లుతోంది. విహారానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఇడుక్కి జిల్లాలోని వాగమన్ ప్రాంతంలో గాజు వంతెన(Glass Bridge) ప్రారంభమైంది. గాజు వంతెనల్లో దేశంలోనే అతి పొడవైన వంతెన ఇదే కావడం విశేషం. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ వంతెనను కేరళ పర్యాటక మంత్రి పి.ఎ.మహమ్మద్ రియాస్ బుధవారం ప్రారంభించారు. దీని పొడవు 40 మీటర్లు. ఈ గ్లాస్ వంతెనపై ఏకకాలంలో 15 మంది ఎక్కి ప్రకృతి అందాలను ఆస్వాదించొచ్చు. పిపిపి భాగస్వామ్యంతో 3కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనకు ఎంట్రీ ఫీజును రూ.500లుగా నిర్ణయించినట్టు జిల్లా టూరిజం ప్రామోషన్ కౌన్సిల్ అధికారులు వెల్లడించారు. దీంతో పాటు స్కై వింగ్, స్కై సైక్లింగ్, స్కై రోలర్, రాకెట్ ఇంజెక్టర్, జెయింట్ స్వింగ్ వంటి అనేక సాహసోపేతమైన అనుభూతిని పర్యాటకులకు పంచేందుకు అడ్వెంచర్ టూరిజం పార్కును ప్రారంభించారు. ఈ గాజు వంతెన నిర్మాణం కోసం జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 35 టన్నుల స్టీలును వినియోగించినట్టు అధికారులు తెలిపారు.

ఈ గాజు వంతెన మరింతగా పర్యాటకులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని డీటీపీసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గాజు పలకల ఆధారంగా రూపొందించిన ఈ వంతెన బాటపై నడిచి అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. పచ్చని ప్రకృతి, పొగమంచు అందాల మధ్య ఈ బాటపై అడుగులు వేస్తుంటే ఆకాశంలో నడుస్తున్నామన్న అనుభూతి కలుగుతుంది. ఈ వంతెనపైకి ఎక్కిన సందర్శకులు సమీపంలోని కుట్టిక్కల్, కొక్కయార్ వంటి ప్రదేశాలను వీక్షించవచ్చు.



శుక్రవారం 08-09-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
శ్రావణ మాసం

**తిథి : బ. నవమి రా. 078.06**
**నక్షత్రం : మృగశిర ప. 03.57**
**వర్జ్యం : రా. 12.50 ల 02.31**

### ఆస్ట్రేలియా స్థానిక ఎన్నికల్లో డిప్యూటీ మేయర్ గా తెలంగాణ ఆడబిడ్డ శాండీరెడ్డి



ఏ దేశమేగినా.. ఎందు కాలిడినా.. తెలుగువారు ప్రత్యేకతను సంతరించుకోవడం మామూలే. ప్రఖ్యాతి గాంచిన ఎన్నో దేశాలలో వివిధ ఉన్నతమైన పదవులలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారు ఎంతోమంది ఉన్నారు. ఇక తాజాగా ఆస్ట్రేలియా స్థానిక ఎన్నికల్లో డిప్యూటీ మేయర్ గా తెలంగాణ ఆడబిడ్డ విజయం సాధించింది. దీంతో తెలంగాణ బిడ్డకు అపూర్వ గౌరవం దక్కిందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సెప్టెంబర్ 5వ తేదీన జరిగిన ఆస్ట్రేలియా సాధారణ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ కరెన్ పెన్సబెన్ మేయర్ గా ఎన్నికయ్యారని స్ట్రాత్ ఫీల్డ్ కౌన్సిల్ ప్రకటించింది. తెలంగాణ బిడ్డ కౌన్సిలర్ సంధ్యారెడ్డి అలియాస్ శాండీ రెడ్డి డిప్యూటీ మేయర్ గా ఎన్నికయ్యారని వెల్లడించింది.

స్ట్రాత్ ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నికలు చాలా ఉత్కంఠ భరితంగా జరిగాయి. రాజకీయ పార్టీల ప్రాబల్యంతో జరిగిన ఉత్కంఠభరితమైన స్థానిక పోరులో 25 వేల మంది ఓటర్లు తెలంగాణ ఆడబిడ్డ శాండీ రెడ్డిని డిప్యూటీ మేయర్ ను ఎన్నుకున్నారు. ఆమె స్థానిక నివాసితులకు ప్రాతినిధ్యం వహిస్తుందని, వారికి అండగా నిలబడతారని నమ్మి ఓటర్లు ఆమెకు పట్టం కట్టారు.

సంధ్యా రెడ్డి అలియాస్ శాండీ రెడ్డి ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్ గా నియమితులైన మొదటి భారతీయ సంతతికి చెందిన మహిళ. అందులోనూ ఆమె మన తెలంగాణ బిడ్డ కావడం విశేషమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంధ్య రెడ్డి అలియాస్ శాండీ రెడ్డి కి 2020 సంవత్సరానికి స్ట్రాత్ ఫీల్డ్ సిటిజన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు కూడా లభించింది.

తెలంగాణ బిడ్డ ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్ గా ఎన్నిక కావడం పట్ల ఎన్నారై కోఆర్డినేటర్ మహేష్ బిగాల అభినందనలు తెలియజేశారు. తెలుగువారి ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని ఆస్ట్రేలియాలో ఘనంగా మొట్టమొదటి పీపీ విగ్రహావిష్కరణ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న శాండీ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని తెలంగాణ వాసులు, ఎన్నారైలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు

**విజయనగరం:** అధికారులు, సిబ్బంది బాధ్యతగా ఉండాలని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా ప్రక్రియను సజావుగా, విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. 2023-24 సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఏర్పాట్లు, సన్నద్ధతపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని ఈ ఏడాది మరింత మెరుగ్గా ప్రక్రియను నిర్వహించాలని జేసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది 4.37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాలను చేరుకునేందుకు అందరూ సమష్టి కృషి చేయాలని చెప్పారు. ఈ ఏడాది ప్రక్రియలో ఆర్బీవోలు భాగస్వామ్యం అవుతున్నారని, డివిజన్ పరిధిలో సమీక్షలు నిర్వహించి ముందస్తు చర్యలు తీసుకోవటంలో ఆర్డీవోలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు, క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. రైతులకు అన్ని విషయాలపైనా పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు జరిగ సమయంలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

# వినాయక చవితిపై క్లారిటీ ఇచ్చిన కాణిపాకం దేవస్థానం

వినాయక చవితిని ఎప్పుడు నిర్వహించుకోవాలనే గందరగోళం నడుస్తోంది. 18, 19 రెండు తేదీల్లో చవితి ఉండటంతో అందరూ సందిగ్ధంలో పడిపోయారు. ఆగమ పండితులు చెబుతున్నదాని ప్రకారం ఈనెల 18వ తేదీ సోమవారం పండగ జరుపుకోవాలని సూచిస్తున్నారు. సోమవారం ఉదయం 10.15 గంటల వరకు తదియ ఉంది. మధ్యాహ్నం నుంచి చతుర్థి మొదలై మంగళవారం ఉదయం 10.43గంటల వరకు ఉంది.

ఇటువంటి సందర్భాల్లో చతుర్థి మొదలైన రోజునే వినాయకచతుర్థి జరుపుకోవాలని గ్రంథాలు చెబుతున్నాయి. 2000, 2009, 2010, 2019 సంవత్సరాల్లో కూడా ఇటువంటి సందిగ్ధతే ఏర్పడింది. అప్పుడు కూడా తదియతో ఉన్న చతుర్థినే పర్వదినంగా జరుపుకున్నారనే విషయాన్ని పండితులు తెలియజేస్తున్నారు. వినాయక చవితి ఎప్పుడునే గందరగోళంపై వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉన్న స్వయంభూ కాణిపాకం వరసిద్ధి వినాయకుడి దేవస్థానం కూడా స్పష్టత ఇచ్చింది.



చవితి తిథి ఈ నెల 18నే అని చెబుతోంది. కాణిపాకం దేవస్థానం వినాయక చవితిని ఆరోజే జరుపుతోంది. ఈ సంవత్సరం భాద్రపద శుద్ధ చవితి 18-9-2023 సోమవారం ఉదయం 10-15 నిమిషాలు నుంచి తర్వాత రోజు ఉదయం 10-43 నిమిషాల వరుకు ఉంటుంది. 18-9-2023 రోజు రాత్రి మాత్రమే చవితి తిథి ఉంది. ఆ తిథి ప్రాకారం కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 21 రోజుల పాటు కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన వేద పండితులు కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తున్నారు. 18నే పండగ జరుపుకోవాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కూడా నిర్ణయం తీసుకుంది. ఇప్పుడే రెండు తెలుగు రాష్ట్రాల్లో గణేష్ మండప నిర్మాణాలు జరుగుతున్నాయి.

# కేశాలకు బాదాం ఆయిల్ సీక్రెట్ టెక్నిక్



పొడవాటి, మెరిసే మరియు ఒత్తైన జుట్టును పొందడానికి పురాతన పద్ధతి నూనెను ఉపయోగించడం. మీ తలకు నూనెతో మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరుగుతుంది. ఇది జుట్టు పెరుగుదలను మరింత పెంచుతుంది. దాంతో జుట్టు మూలాలకు పోషణ అందుతుంది. అయితే మసాజ్ ఒక్కటే ముఖ్యం కాదు. సరైన నూనెను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యం. హెయిర్ ఆయిల్స్ లిస్ట్ చాలా పెద్దదే ఉన్నప్పటికీ, బాదం నూనె జుట్టు రాలడాన్ని తగ్గించడంలో అత్యంత ప్రభావవంతమైనదిగా నిరూపించబడింది.

జుట్టు రాలడాన్ని నియంత్రించడంలో బాదం నూనె ఎందుకు ప్రభావవంతంగా ఉంటుంది?

**తలలో దురదను పోగొడుతుంది**

స్కాల్ప్ (తల)పై మృతకణాలు పేరుకుపోవడం వల్ల అనేక జుట్టు సమస్యలు వస్తాయని అందరికీ తెలిసిన విషయమే. దీని కారణంగా మీరు జుట్టు రాలడం, దురద మరియు చుండ్రు వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఫుట్‌వర్క్ ఈ సమస్యలను అధిగమించడంలో మీకు సహాయపడుతుంది. తలకు పోషణ మరియు హైడ్రేట్ చేయడానికి బాదం నూనెను ఉపయోగించి చూడండి.

**జుట్టు తిరిగి పెరగడానికి సహాయపడుతుంది**

బాదం నూనెలో బయోటిన్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మీ జుట్టుకు బాదాం ఆయిల్‌తో మసాజ్ చేయడం వల్ల మీ స్కాల్ప్‌కి రక్త ప్రసరణ పెరుగుతుంది, మీ జుట్టు మూలాలకు పోషణ లభిస్తుంది, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది మరియు మీ జుట్టు మెరిసేలా చేస్తుంది. అలాగే, ఇది మీ జుట్టు పెరుగుదలను పెంచుతుంది.

**మసాజ్ చేయడం వల్ల జుట్టు పరిమాణం పెరుగుతుంది**

విటమిన్ ఇ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మరియు ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు బాదం నూనెలో లభించే కొన్ని ముఖ్యమైన పోషకాలు. అవి ఆరోగ్యకరమైన జుట్టుకు సహాయపడతాయని నిరూపించబడింది. ఇవి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి మరియు జుట్టు పరిమాణాన్ని పెంచుతాయి. బాదం నూనె కూడా యాంటీఆక్సిడెంట్ల యొక్క శక్తివంతమైన మూలం. అంటే జుట్టు అకాల నెరవడం ఆలస్యం చేస్తుంది.

**జుట్టు సమస్యలను తగ్గిస్తుంది**

మీకు జుట్టు రాలే సమస్య ఉందా? చిక్కుబడ్డ జుట్టును మెయింటెయిన్ చేయడం కష్టంగా ఉందా? అవును. అయితే, బాదం నూనె మీ జుట్టును మృదువుగా చేస్తుంది. ఇది జుట్టును సిల్కీగా మార్చడంతోపాటు కండీషనర్‌గా పని చేస్తుంది. కాబట్టి, మీ జుట్టును దువ్వేటప్పుడు మీకు ఎలాంటి సమస్య ఉండదు. అదనంగా, ఇది జుట్టు దెబ్బతినే అవకాశాన్ని కూడా తగ్గిస్తుంది.

**జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది**

బాదం నూనెలో ఉంజుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుందిడే ఒలీక్ మరియు లినోలిక్ యాసిడ్లు మీ జుట్టును బలపరుస్తాయి మరియు మృదువుగా చేస్తాయి. అదనంగా, నూనెలోని విటమిన్ ఇ యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది మరియు స్ప్లిట్ చివరలను నిర్వహించడానికి మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

**బాదం నూనెతో తలకు మసాజ్**

బాదం నూనెను ఉపయోగించే ముందు వేడి చేయండి. మీ తలకు నూనె రాసి సున్నితంగా మసాజ్ చేయండి. జుట్టు పొడవునా నూనె రాయండి. నూనె రాసిన 3-4 గంటల తర్వాత జుట్టును షాంపూతో శుభ్రం చేసుకోవాలి. జుట్టు రాలడాన్ని ఎదుర్కోవడానికి మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి మీ స్కాల్ప్ మరియు హెయిర్ మసాజ్ చేయడం ఒక గొప్ప టెక్నిక్. ఫాస్ట్‌గా రిజల్ట్ పొందడం కోసం, వారానికి రెండుసార్లు తలకు మసాజ్ చేయండి. మీ జుట్టుకు నూనెను పూయడం వల్ల జుట్టు మరియు తలకు పోషణ మాత్రమే కాకుండా జుట్టు ఉత్తమంగా కనిపిస్తుంది. స్కాల్ప్ మసాజ్ మీ జుట్టుకు రక్షిత పొరను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది, ఎండ, కాలుష్యం మరియు చిన్న వయస్సులోనే తెల్లజుట్టు సమస్యల నుండి కాపాడుతుంది.

**బాదం నూనె హెయిర్ మాస్క్**

మెంతి గింజలు మరియు అరటిని మిక్సీలో రుబ్బుకోవాలి. దానికి ఒక టీస్పూన్ తేనె మరియు ఒక టీస్పూన్ బాదం నూనె వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. ఇప్పుడు మీ హెయిర్ మాస్క్ సిద్ధంగా ఉంది. దీన్ని మీ తలపై మరియు జుట్టు పొడవున అప్లై చేయండి. దీన్ని 15-20 నిమిషాలు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. మెంతి గింజలు చుండ్రు మరియు జుట్టు రాలడం వంటి ఇతర జుట్టు పరిస్థితులను నివారిస్తాయి. అదనంగా, ఈ హెయిర్ మాస్క్‌లోని అరటిపండు మీ జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేయడానికి ఒక సీక్రెట్ పదార్థంగా పనిచేస్తుంది.

**బాదం నూనె సీరం**

బాదం నూనె సీరమ్ మీ జుట్టు బరువుగా కనిపించేలా చేస్తుంది. అలోవెరా మరియు లావెండర్ జుట్టు రాలడాన్ని ఆపడానికి బాదం నూనె యొక్క ప్రయోజనాలను మెరుగుపరుస్తాయి. మూడు చుక్కల లావెండర్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్ మరియు ఒక టీస్పూన్ బాదం నూనె కలపండి. ఈ పదార్థాలన్నీ బాగా మిక్స్ చేసి అప్లై చేయాలి. తడిగా ఉన్నప్పుడే మీ జుట్టు పొడవునా సీరమ్‌ను అప్లై చేయండి. లేడీస్, మీరు మెరిసే జుట్టును పొందాలంటే, ఈ అద్భుతం బాదం నూనెను మిస్ చేయకండి.

# మెరిపించే నూనె



అందంగా ఉండాలని ఎవరికి ఉండదు. మగవారికైనా, ఆడువారికైనా అందంగా కనిపించాలని ఉంటుంది. కానీ అందుకు తగ్గట్టు శ్రమ కూడా పడాల్సిందే. మంచి స్కిన్ కేర్ అండ్ బాడీ కేర్ తీసుకుంటే అందం మీ సొంతం అవుతుంది. అయితే కొన్ని పద్దతులు ఖచ్చితంగా పాటించాలి. కానీ సమయం ఉండదు. మీ సమయానికి తగ్గట్టు గానే ప్లాన్ చేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మనం పురాతన కాలం నుంచి ఉపయోగించే కొబ్బరి నూనెలో ఎన్నో అద్భుతమైన గుణాలు ఉన్నాయన్న విషయం తెలిసిందే. ఈ నూనెను సరిగ్గా ఉపయోగిస్తే మంచి రిజల్ట్ ఉంటాయని నిపుణులు కూడా చెబుతున్నారు. కొబ్బరి నూనె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇక నుంచి చర్మానికి, జుట్టుకుని కోకోనెట్ ఆయిల్‌ను రాసుకుని స్నానం చేస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. ఇలా ఈ నూనె రాయడం వల్ల చర్మంతో పాటు జుట్టుకు కూడా మంచి పోషణ అందుతుంది.

**కొబ్బరి నూనెతో అమేజింగ్ బెనిఫిట్స్:** క్రిములు, బ్యాక్టీరియా నశిస్తాయి: స్నానం చేసే ముందు చర్మానికి కొబ్బరి నూనెతో మసాజ్ చేసుకుంటే చర్మం మెరిసిపోతుంది. సాధారణంగా మన శరీరంపై కొన్ని రకాల క్రిములు, బ్యాక్టీరియా పేరుకుని ఉంటాయి. అందుకే ఖచ్చితంగా మీరు స్నానం చేస్తే ముందు కొబ్బరి నూనె రాసి కాస్త మసాజ్ చేసి స్నానం చేస్తే చర్మంపై ఉన్న క్రిములు పోతాయి.

**ఆరోగ్యంగా చర్మం:** కొబ్బరి నూనెలో ఉన్న ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. సాఫ్ట్‌గా, షైనీగా, మొటిమలను తగ్గించడంలో కోకోనెట్ ఆయిల్ సహాయ పడుతుంది. కొబ్బరి నూనె తో మసాజ్ చేయడం వల్ల ముడత లు తగ్గుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

**పట్టుకుచ్చులా జుట్టు:** కొబ్బరి నూనె రాసుకుని, కాస్త కుదుళ్లకు మసాజ్ ఇచ్చి తల స్నానం చేస్తే జుట్టు పట్టుకుచ్చులా ఉంటుంది. మంచి షైనింగ్ వస్తుంది. జుట్టు కూడా నల్లబడుతుంది.

**మాయిశ్చరైజింగ్ లా పని చేస్తుంది:** కొంతమంది స్కిన్ ఊరికే పొడిబారుపోతుంది. అలాంటి వారికి కొబ్బరి నూనె మంచి మెడిసిన్ లా పని చేస్తుంది. రోజూ స్నానం చేసే ముందు కొబ్బరి నూనెతో మసాజ్ చేస్తే చర్మానికి మాయిశ్చరైజర్ లా పని చేస్తుంది. అలాగే రాత్రిళ్లు కొన్ని కొబ్బరి నూనెను శరీరానికి రాసుకుని పడుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

**మృదువుగా మారతాయి:** స్నానానికి ముందు లేదా ముందు రోజు రాత్రి చర్మానికి, జుట్టుకి కోకోనెట్ ఆయిల్ రాసుకుని మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. దీని వల్ల చర్మం, జుట్టు మృదువుగా మారతాయి.

# పళ్ళతో బరువు తగ్గండి



మనకు సంపూర్ణ పోషకాలను అందించడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. కానీ మనం వాటిని పెద్దగా పట్టించుకోం. అందులోనూ సీజనల్‌గా వచ్చే పండ్లను అస్సలు మిస్ చేయకుండా తినాలి. కానీ మనకు నీరసంగా ఉన్నప్పుడు, జ్వరం వచ్చినప్పుడు మాత్రమే అవి గుర్తొస్తాయి. పండ్లలో శరీరానికి మేలు చేసే ఎన్నో రకాల పోషకాలు, విటమిన్స్, ఫోలిక్ యాసిడ్స్, ఫైబర్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి పుష్కలంగా ఉంటాయి. కానీ కొంతమంది అతిగా పండ్లను తినేస్తారు. అలా తిన్నా కూడా అనారోగ్యం పాలవుతారని నిపుణులు చెబుతున్నారు. రోజూ సరైన మోతాదులో ఫ్రూట్స్‌ని తీసుకోవడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అందులోనూ ప్రస్తుతం అధిక బరువుతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారు పండ్లను తమ డైట్ లో చేర్చుకుని ఈజీగా బరువు తగ్గొచ్చు. మరి బరువు తగ్గేందుకు పండ్లను ఎలా తీసుకుంటే బెటరో ఇప్పుడు తెలుసుకుందాం.

**పెరుగు, చీజ్ తో పండ్లు:** మీరు బరువు తగ్గాలనుకుంటే ప్రొటీన్ తో కలిపి తీసుకోవాలి. కాటేజ్ చీజ్ పండ్లు, గ్రీక్ పెరుగు, నట్స్ వంటి రిచ్ ఫుడ్స్ తీసుకుంటే ఆకలి కంట్రోల్ లో ఉంటుంది. పెరుగు, నట్స్ వల్ల కొద్దిగా తిన్నా పొట్ట నిండిన భావన కలుగుతుంది. అలాగే కెలరీస్ కూడా ఎక్కువగా అందుతాయి. కాబట్టి వేరేవి తినాలన్న కోరిక ఉండదు.

**ఖాళీ కడుపుతో పండ్లు తినకూడదు:** పండ్లను ఎప్పుడూ ఖాళీ కడుపుతో తినకూడదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి ప్రొటీన్, తృణ ధాన్యాలు, పండ్లు కలిపి తీసుకుంటే బెటర్.

**ఎక్కువగా తినకూడదు:** ఫ్రూట్సే కదా ఏమీ కాదని ఎక్కువగా తినకూడదు. ఎందుకంటే పండ్లలోనే కెలరీస్, చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మీరు బరువు తగ్గాలన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన మోతాదులో తినాలి.

**కేవలం ఫ్రూట్స్ మీదనే ఆధారపడకూడదు:** చాలా మంది చేసే తప్పు ఏంటంటే ఫ్రూట్స్ తింటున్నాం కదా అని బ్రేక్ ఫాస్ట్, లంచ్ పై ఆసక్తి చూపించరు. కానీ ఇది చాలా తప్పు. ఇలా చేస్తే బరువు తగ్గడం సంగతి పక్కన పెడితే అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయి. కొన్ని రకాల పండ్లను మీ భోజనం, మరికొన్ని స్మూతీలలో, సలాడ్స్, నట్స్ ఇలా కలుపుతూ తీసుకుంటూ ఉండాలి.

# బేబీ మసాజ్ ఆయిల్‌ను ఇంట్లోనే తయారు చేసుకోండిలా!



పిల్లల దగ్గరికి వచ్చే సరికి మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు తల్లులు. వారికంటూ సపరేట్ కేర్ తీసుకుంటారు. వారు లేచిన దగ్గర్నుంచి పడుకునే వరకు వారిని ఒక మహారాజు, మహారాణిలా చూస్తారు. పిల్లలతో పోల్చితే వారి స్కిన్, జుట్టు కూడా వేరేగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలకు రాసే మసాజ్ ఆయిల్ గురించి తల్లులు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎందుకంటే కొంతమంది పిల్లలకు కొన్ని రకాల ఆయిల్స్ అస్సలు పడవు. ఎలర్జీస్ వస్తాయి. కాబట్టి ఆయిల్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పిల్లలకు చేసే మసాజ్ ఆయిల్ ను ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మరి ఆయిల్ ను ఎలా తయారు చేయాలి? తయారు చేయడానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? ఎన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**బేబీ హోమ్ మసాజ్ ఆయిల్ తయారీకి కావాల్సిన పదార్థాలు:**

**ఆముదం, ఆలీవ్ ఆయిల్, లావెండర్ ఆయిల్**

**తయారీ విధానం:** ముందుగా ఓ గిన్నె లేదా డబ్బాలో ఓ రెండు టేబుల్ స్పూన్ ఆముదం తీసుకోవాలి. దానిలోకి స్వచ్ఛమైన ఒక టేబుల్ స్పూన్ ఆలీవ్ ఆయిల్‌ను కలపాలి. అందులో ఓ రెండు చుక్కల లావెండర్ ఆయిల్ వేయాలి. వీటన్నింటి బాగా కలపండి. అంతే బేబీ మసాజ్ ఆయిల్ రెడీ. దీన్ని స్కిన్ కి, జుట్టుకు కూడా వాడుకోవచ్చు.

**గుర్తు పెట్టుకోవాల్సిన విషయాలు:** ఈ బేబీ ఆయిల్ తయారు చేయడానికి కావాలంటే కొబ్బరి నూనెను కూడా వాడవచ్చు. అయితే అది స్వచ్ఛమైనదై ఉండాలి. కావాలంటే కొబ్బరి నూనెను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. ఆలీవ్ ఆయిల్, కొబ్బరి నూనె స్వచ్ఛంగా లేకపోతే పిల్లలకు చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.

పిల్లలకు రాసే ఆయిల్‌ను వేడి చేసే పద్దతి కూడా వేరేలా ఉంటుంది. డైరెక్ట్ గా పొయ్యి మీద పెట్టి వేడి చేయకూడదు. డబుల్ బాయిలింగ్ పద్ధతిలో నూనె వేడి చేసి పిల్లలకు మసాజ్ చేయాలి.

ఇలా వేడి అయిన ఆయిల్ ను ఓ గాజు లేదా స్టీల్ డబ్బాలో పెట్టడం మంచింది. ప్లాస్టిక్ డబ్బా వాడకపోవడమే బెటర్.

# వర్షాకాలంలో స్పైసీ, వేడి ఫుడ్ తింటున్నారా?



వర్షాకాలం వచ్చేసింది. దీంతో వేడి వేడిగా స్పైసీగా ఫుడ్, సూప్స్, స్నాక్స్ కానీ తినాలనిపిస్తుంది. మన ఇండియాలో ఎవరైనా అంతే. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే వేడి వేడి, స్పైసీ ఫుడ్‌కే మక్కువ చూపిస్తారు. ఎందుకంటే బాడీలో ఉష్ణోగ్రత పెంచడానికి. బయట కూల్ ఉంటే బాడీలో టెంపరేచర్ లెవల్స్ పడిపోతూ ఉంటాయి. కాబట్టి వేడి, స్పైసీ ఫుడ్‌కే ప్రిఫరెన్స్ చూపిస్తారు. ఇలా తింటే వ్యాధులు కూడా దరిచేరవని పెద్దల నమ్మకం. అయితే వర్షా కాలంలో స్పైసీ ఫుడ్ తినకూడదని నిపుణులు చెబుతున్నారు. మనం వాడే ఘాటైన మసాలాలతో పలు రకాల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. మరి వీటివల్ల ప్రయోజనాలు ఏంటో, నష్టాలేంటో చదవండి.

**జీవక్రియ:** వర్షాకాలంలో స్పైసీ ఫుడ్ తింటే అరుగుదల చాలా తక్కువగా ఉంటుంది. దీంతో మీరు తీసుకునే ఆహారం జీవక్రియపై ఎఫెక్ట్ చూపిస్తాయి. కాబట్టి మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు.

**గుండె పై ప్రభావం చూపుతుంది:** గుండె సమస్యలు ఇటీవల కాలంలో బాగా ఎక్కువ అయ్యాయి. గుండె ఆరోగ్యంగా ఉండాలన్నా, పని చేయాలన్నా స్పైసీ ఫుడ్ జోలికి వెళ్లకుండా ఉంటేనే బెటర్ అని చెప్పవచ్చు. జంక్ ఫుడ్, స్పైసీ ఫుడ్ తింటే హై కొలెస్ట్రాల్, హైబీపీ పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంపై ఎఫెక్ట్ చూపిస్తాయి.

**ప్రేగు ఆరోగ్యం:** ప్రేగులు ఆరోగ్యంగా ఉంటేనే మనం తినే ఆహారం బాగా జీర్ణం అవుతుంది. ప్రేగులు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి. అయితే ఉప్పు, స్పైసీ ఫుడ్ తింటే గట్ లోని చెడు బ్యాక్టీరియా తగ్గించి, మంచి బ్యాక్టీరియాని పెంచుతాయి.

**నొప్పి నివారిణి:** రెయినీ సీజన్‌లో స్పైసీ ఫుడ్ తింటే నొప్పి నివారిణిగా పని చేస్తుంది. ఆస్టియో ఆర్థరైటీస్, డయాబెటీస్ ఉన్న వారిలో స్పైసీ ఫుడ్ నొప్పిని తగ్గించేందుకు సహాయ పడుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

# రోజూ ఈ పొడి తింటే హార్ట్ ఎటాక్ రాదు!



ఇప్పుడు ఎక్కడ చూసినా, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ గుండె పోటుకు గురవుతున్నారు. చిన్న వయసులోనే హార్ట్ ఎటాక్‌తో మరణిస్తూండటం అందర్నీ కలిచి వేస్తోంది. మాట్లాడుతూ, నడుస్తూ, పని చేస్తూ ఉంటూనే ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నారు. మంచి, చెడు మాట్లాడే సమయం కూడా ఉండటం లేదు. ఎంత ఫిట్‌గా ఉంటున్నా కూడా ఈ సమస్యలు రోజు రోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. సెలబ్రిటీలు సైతం చిన్న ఏజ్ లోనే గుండె పోటుతో మరణిస్తున్నారు. హార్ట్ ఎటాక్ కి అనేక రకరకాల కారణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

అతిగా తినడం, పొగ త్రాగడం, మద్యం సేవించడం, సరైన నిద్ర లేకపోవడం, రోజూ ఒకే చోట కూర్చొని ఉండం, ఆందోళనకు గురవ్వడం, ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, వ్యాయామం చేయకపోవడం, జంక్ ఫుడ్ తినడం ఇలా ఒక్కటేంటి గుండె పోటుకు చాలా కారణాలు ఉంటున్నాయి. గతంలో 50 ఏళ్లు పైబడిన వారు మాత్రమే హార్ట్ ఎటాక్‌కు గురయ్యేవారు. కానీ ఇప్పుడు 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సువారికి కూడా గుండె పోటులు వస్తున్నాయి. గుండె ఆరోగ్యంపై సరైన శ్రద్ధ చూపించకపోవడం వల్లనే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

అయితే అర్జున చెట్టు బెరడును రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. దీంతో జీవితంలో గుండెకు సంబంధించిన సమస్యలు చాలా వరకు రావని వైద్య నిపుణులు అంటున్నారు. ఈ అర్జున చెట్టు బెరడు ఆయుర్వేద షాపుల్లో విరివిగా లభిస్తుంది. లేదా చెట్టు బెరడు అందుబాటులో ఉన్నా వాడుకోవచ్చు. ఈ అర్జున చెట్టు బెరడు లేదా పొడిని ఒక గ్లాస్ పాలలో వేసి బాగా మరిగించాలి. అనంతరం ఈ నీటిని తాగితే హార్ట్ ఎటాక్‌లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

అలాగే రాత్రంతా ఈ పొడి లేదా బెరడును నీళ్లలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం అయినా తాగవచ్చు. ఈ విధంగా అర్జున చెట్టు బెరడును తీసుకోవడం వల్ల గుండె సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం గుండె సమస్యలే కాదు ఇతర అనారోగ్య సమస్యలను కూడా దరి చేరకుండా చేస్తుంది. బీపీని కంట్రోల్ లో ఉంచుతుంది. ఆస్తమా, దగ్గు కూడా తగ్గుతాయి. చర్మ సమస్యలు కూడా రావు.

# మీరు అధికంగా నీరు తాగుతున్నారా..?



**వికారం, వాంతులు:** ఎక్కువ నీరు తాగడం ఆరోగ్యానికి హానికరం. మీరు వికారం, వాంతులు అనుభవించవచ్చు. అంటే నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా అతిగా తాగితే ఇబ్బందులు వస్తాయి. మీరు వాంతులు వంటి సమస్యలను ఎదుర్కోవడం ప్రారంభిస్తే, మీరు చాలా నీరు తాగుతున్నారని భావించండి.

**తలనొప్పి:** నీరు ఎక్కువగా తాగితే శరీరంలో సోడియం తగ్గుతుంది. రక్తంలో సోడియం తక్కువగా ఉంటే తలనొప్పికి గురవుతారు. సోడియం తక్కువగా ఉన్నప్పుడు తలనొప్పి, అశాంతి వంటి సమస్యలు వస్తాయి. ఇవి ఎక్కువ నీరు తాగడం వల్ల ఈ సమస్యలు వస్తాయి.

**వాపు:** నీరు ఎక్కువగా తాగడం వల్ల వాపు వస్తుందని ఎప్పుడైనా విన్నారా? అవును ఎక్కువ నీరు తాగడం వల్ల మోకాళ్ళు, పాదాలు, శరీరంలోని వివిధ భాగాలలో వాపు వస్తుంది. నీరు ఎక్కువగా తాగడమే దీనికి కారణం.

**అలసట:** ఎక్కువ నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రమాదాలు ఉంటాయి. ప్రతిరోజూ 3-4 లీటర్ల నీరు తాగాలని సిఫార్సు చేయబడింది. కానీ మీరు అంతకంటే ఎక్కువ తాగితే, మీరు అలసిపోయినట్లు అనిపించవచ్చు. ఆయాసం ఉంటే నీరసంగా అనిపిస్తుంది.

**కండరాల నొప్పులు:** ఎక్కువ నీరు తాగడం వల్ల సోడియం తగ్గుతుందని మనం ఎప్పుడూ చదువుతూ ఉంటాం. రక్తంలో సోడియం తక్కువగా ఉండటం వల్ల అనేక సమస్యలు వస్తాయి. కండరాలలో తిమ్మిరి ఏర్పడుతుంది. దీనితో పాటు, బలహీనత కూడా అనుభూతి చెందుతుంది. ఇందులోని అంశాలు సూచనలు, సలహాల మేరకు అందించాము. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నాము.

# గడువుకు ముందే పరిష్కరించాలి



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** పరిశ్రమల స్థాపన కోసం సింగల్ డెస్క్ పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువుకు ముందే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ విషయం లో ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గురువారం కలక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఎక్కువగా భూ సమస్యలే తలెత్తుతున్నాయని, ఈ భూ సమస్యలన్నిటినీ ఎ పి ఐ ఐ సి అధికారులు సంయుక్త కలెక్టర్‌తో చర్చించి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. కొత్తవలస మండలం బీమాలి లో మాంగో జెల్లీ పరిశ్రమకు కోల్డ్ స్టోరేజ కోసం ప్రైవేటు ల్యాండ్ ను 25 ఏళ్ళకు లీజ్‌కు తీసుకోవడం జరుగుతోందని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పాపా రావు తెలిపారు. ఈ పరిశ్రమను నాబార్డ్ ద్వారా రుణ సహాయాన్ని అందించి ఎఫ్.పి.ఓలకు మంజూరు చేసే అవకాశం ఉందేమో పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. భోగాపురంలో ఆక్వా పరిశ్రమకు వాటర్ పైప్‌లైన్ సమస్యను త్వరగా పరిష్కరించాలని మత్స్య శాఖ జే.డికు సూచించారు. భూ వివాదాలు, కోర్ట్ కేసులు ఉన్న భూములకు అలినేషణ్ ప్రక్రియ పూర్తి చేసుకొని కోర్ట్ ఆర్డర్స్ కోసం సిద్ధంగా ఉండాలని, కోర్ట్ కేసులని చెప్పి వదిలేకూడదని సూచించారు.

ఈ సమావేశంలో జే.సి. మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, జిల్లా అధికారులు, ఎ పి ఐ ఐ సి ప్రతినిధులు పాల్గొన్నారు.

Life Insurance
Aditya Birla Sun Life Insurance Company Ltd.
(A subsidiary of Aditya Birla Capital Ltd.)
ADITYA BIRLA CAPITAL
1800-270-7000
Regn. No.: 109. Regd Office: One World Centre, Tower 1, 16th Floor, Jupiter Mill Compound, 841, Senapati Bapat Marg, Elphinstone Road, Mumbai - 400 013. +91 22 4356 7000 | CIN: U99999MH2000PLC128110
నోటీసు
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ శ్రీకాకుళం కార్యాలయాన్ని 31/08/2023 నుంచి తరలిస్తోంది
మూసివేయబడుతున్న ప్రాంగణం: ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 2వ అంతస్తు, సిండికేట్ బ్యాంక్, రామకృష్ణ థియేటర్ లేన్, శ్రీకాకుళం - 532001
కొత్త ప్రాంగణం: ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 2వ అంతస్తు, యూనిట్ నెం. 201, 6-1-13, క్రాంతి ప్రైమ్, చౌక్ వార్డ్, పాలకొండ రోడ్, మలబార్ గోల్డ్ మరియు మాక్స్ ఫ్యాషన్ పైన, శ్రీకాకుళం - 532 001.
స్థలం: ఆంధ్రప్రదేశ్
తేదీ: 08/09/2023
సంతకం చేసిన వారు అధీకృత సంతకందారు
మరిన్ని వివరాలకు, దయచేసి సంప్రదించండి: ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: వన్ వరల్డ్ సెంటర్, టవర్ 1, 16వ అంతస్తు, జూపిటర్ మిల్ కాంపౌండ్, 841, సేనాపతి బాపట్ మార్గ్, ఎల్ఫిన్‌స్టోన్ రోడ్డు, ముంబయి - 400013.
వెబ్‌సైట్: https://lifeinsurance.adityabirlacapital.com మరియు టోల్ ఫ్రీ నం.: 1800-270-7000.
ADV-B/8/23-24/1705



**విజయనగరం:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం చాలా జాగ్రత్తగా పకడ్బందీగా, ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

తొలగించిన ఓటర్లకు సజావుగా నోటీసులు పంపించే

# తొలగించిన ఓట్లకు కారణాలను తెలియజేయాలి

ప్రక్రియ సాగుతోందని, ముఖ్యంగా మృతి చెందిన ఓటర్లకు సంబంధించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పొందడం లేదా పంచనామా నిర్వహించి ఓట్లను ఆన్లైన్ ద్వారా తొలగించడం జరిగిందన్నారు. జిల్లాలో 74 వేల ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు.

పార్టీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అర్బన్ ప్రాంతాల్లో మరో రెండు రోజులు బి.ఎల్.ఓ లు బి.ఎల్.ఏ లతో కలసి డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేయడానికి అంగీకరించారు. అదే విధంగా తొలగించిన ఓట్లకు కారణాలను నియోజకవర్గం వారీగా ఒక ఎక్సెల్ షీట్ లో బి.ఎల్.ఏ లకు అందించాలని సూచించారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, ఈఆర్ఓలు, ఈఏఆర్ ఓలు , పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోణంకిలో ఆగని ఇసుక తవ్వకాలు



**శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్):** శ్రీకాకుళం గ్రామీణ మండలం, రోణంకి గ్రామంలో వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు ఆగడంలేదు. నిత్యం వందల సంఖ్యలో లారీలు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్థులే లారీలను అడ్డుకోవాల్సిన పరిస్థితి. వారం కిందట స్థానికులు వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని బెదిరించారు. వాహనాలను రీచ్‌లోని వెళ్లకుండా గ్రామస్థులు నిలిపియడంతో పోలీసులు ఏడుగురు గ్రామస్థులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇసుక తవ్వకాలకు అనుమతి పొందిన సంస్థ ప్రతినిధి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలిసి స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలు ఊర్లోకి రాకుండా అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. ఇసుక రీచ్ నిర్వాహకులు పోలీసుల సహకారంతో నిబంధనలను తూట్లు పొడుస్తూ తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. గ్రామస్థులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసి తెదేపా సీనియర్ నేత గొండు శంకరరావు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్సై విజయ్ కుమార్‌తో మాట్లాడారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో కేసులు బనాయించడం తగదని, కేసులు పెడితే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# రామాలయం నిర్మాణం చేపట్టండి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లిలో ఉన్న రామాలయం నాలుగు పంచాయతీలకు సంబంధించిన వారు గుడి కడతారని చెప్పి పాత గుడిని ఖాళీ చేయించి సుమారు 13 సంవత్సరాలు అయింది. అప్పటి నుండి ఇప్పటి వరకు గుడి అలాగే ఉండిపోయింది. రామాలయం నిర్మాణం చేపట్టండి అంటూ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ నాయుడు కోరుతున్నారు. పార్టీలకతీతంగా ప్రతి పంచాయితీలో సహకరించి ఈ మధ్యకాలంలో గుడి నిర్మాణాలు చేపడుతుంటే ఇక్కడ మాత్రం రామాలయం నిర్మాణానికి పలు సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సేవా సంఘం ముందుకు వచ్చి అందరికీ ఉపయోగపడే రామాలయం నిర్మాణానికి సహకరిస్తారని కృష్ణం నాయుడు కోరుతున్నారు.

# ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకరోజు



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వెల్లడించారు. జిల్లా అధికారులతో పాటు మండల స్థాయి అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో ఈనెల 13న మొదలై ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా మండలాల్లో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహశీల్దార్‌లు అవసరమైన ఏర్పాట్లు చేస్తారని తెలిపారు.

మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు సెప్టెంబరు 13న రాజాం, 15న బొబ్బిలి, 20న ఎస్.కోట, 22న నెల్లిమర్ల, 27న గజపతినగరం, 29న చీపురుపల్లిలో ఆయా మండల ప్రజాపరిషత్ ప్రాంగణాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా మండలాల ప్రజలంతా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# హెచ్.ఐ.వి/ఎయిడ్స్ - యువజన ఉత్సవం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** భారత ప్రభుత్వం - జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమము యువతలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు యువజన ఉత్సవ కార్యక్రములను నిర్వహిస్తున్నది. దానిలో భాగంగా జూనియర్ ఇంటర్ మరియు డిగ్రీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు జిల్లా స్థాయిలో 5 కిలోమీటర్ల రెడ్ రన్ - మారథాన్ ఈ నెల 9వ తేదీన ఉదయం 6 గంటలకు స్థానిక విజ్జి స్టేడియంలో నిర్వహించనుందని డా. ఎస్. భాస్కర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మరియు బి. రామ్ గోపాల్, జిల్లా క్రీడా అధికారి వారు సంయుక్తంగా తెలియజేసారు. ఈ సమాచారం అన్నీ ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేసింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5 కిలోమీటర్ల రెడ్ రన్-మారథాన్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశములో డా. ఎన్. సూర్యనారాయణ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఎన్. సాక్షి గోపాల రావు, జిల్లా సూపర్వైజర్ ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# గొల్లపేటలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ గొల్లపేట గ్రామంలో గురువారం శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పూజలు చేశారు. సాము గరడీలు, చిడతలు, తప్పుడు గుల్లు సాంస్కృతి కార్య క్రమాలు మధ్య చాలా అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ కృష్ణ భగవానుడుకి ప్రత్యేకంగా పూజలు, నైవేద్యం పెట్టి భారీఅన్న వసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మాసవరపు అప్పలనాయుడు, మాధంశెట్టి నీలబాబు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, కూండ్రపు శ్రీ రామ్ మూర్తి, సారిపల్లి జోగి నాయుడు, కర్రి అప్పల రాజు జిల్లా యాదవ సంఘం నాయకులు, సారిపల్లి నేస్తాలు, సారిపల్లి సోమి నాయుడు, సారిపల్లి అశోక్, కారుకొండ నరేశ్, కూండ్రపు శ్రీనివాస్, వియ్యపు వెంకట రమణ, ఉప్పల నరసింగ రావు, బొడ్డు దేముడు, గోలగాని నరేష్, వియ్యపు ముత్యాలు, వియ్యపు తాతారావు, మొల్లి బాలాజీ ప్రజలు అందరూ పాల్గొన్నారు .

# నర్సింగరావు పేటలో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక నృసింగరావుపేటలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా భగవాన్ శ్రీకృష్ణ భక్తులు ఎస్ డి గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి పూజా ప్రతిమను శ్రీరామ్ చేతుల మీదుగా పురవీధుల్లో ఊరేగించి మండపం వద్ద ప్రతిష్టింపజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ లాంటి సనాతన ధర్మాన్ని కాపాడే ఏ ధార్మిక కార్యక్రమాలకైనా తన వంతు సహాయాన్ని ధర్మంగా భావిస్తానని శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణా కమిటీ సభ్యులు శారద బాల గణపతి యూత్ కమిటీ సభ్యులు, కోన రామకృష్ణ చింతారామ్, జి. పల్ల నాగేశ్వరరావు, కోన సింహాచలం, చవితి నూకరాజు, శంకర్, శ్రీను, నాగు, మురళి, ముఖేష్, పోస్టల్ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 7.28 లక్షల ఓటర్లు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో 7 లక్షల 28 వేల 513 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 లక్షల 6వేల 267 మంది ఓటర్లను వెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గంలో 2 లక్షల 29 వేల 580 మంది ఓటర్లు, పాడేరు నియోజక వర్గంలో 2 లక్ష 30 వేల 90 ఓటర్లు, రంప చోడవరం నియోజక వర్గంలో 2లక్షల 68 వేల 843 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇంటింటికి ఓటరు సర్వేలో 97 శాతం పూర్తి చేసామన్నారు. జీరో ఇంటి నెంబర్లు ఉన్న గృహాలు 10,151 - ఉన్నాయన్నారు. వాటికి కేటాయిస్తామన్నారు. మృతి చెందిన ఓటర్లు 3949 మంది రెండు చోట్ల ఓటర్లగా నమోదైన ఓటర్లు 4850 మంది, నకిలీ ఓటర్లు 48, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 707 మంది ఉన్నారని చెప్పారు. డోరు నెంబర్లలో అందుబాటులో లేని ఓటర్లు 576 మంది ఉన్నారని చెప్పారు. వివిధ రాజకీయ పార్టీలు సూచనల మేరకు 68 మంది ఓటర్లలో 40 మందిని పునః పరిశీలన చేయడం జరిగిందన్నారు. మరో 28 మంది ఓటర్లను పరిశీలించ వలసి ఉందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణ ద్వారా జీవనోపాధిని పొందుతున్నాం : మహిళలు

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** స్థానిక మండల సమాఖ్య, గజపతినగరం కార్యాలయములో కుట్టు శిక్షణకు సంబంధించి మొదటి మరియు రెండువ బ్యాచ్‌లకు సంబంధించి శిక్షణ తీసుకున్న 60 మంది మహిళలతో సమావేశము ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధిలుగా భారత్ డైనమిక్ లిమిటెడ్, హైదరాబాద్ నుండి ఫైనాన్స్ డైరెక్టరు ఎన్. శ్రీనివాసులు, హెచ్ ఆర్. పరిపాలన నుండి ఎన్.సత్యన్నారాయణ హాజరై మహిళలకు ఉద్యోగ ఆధారిత నైపుణ్య కుట్టు శిక్షణ ఏ విధంగా ఉపయోగపడుతుందో రెండు బ్యాచ్ ల మహిళలను అడిగినారు. ఈ సందర్భంగా మొదటి బ్యాచ్‌లో శిక్షణ తీసుకున్న బాసి సంధ్య, యం. వెంకటాపురం వారు మాట్లాడుతూ ఈ శిక్షణ ఎంతోగానో ఉపయోగ పడుతుందని స్వంతగా ఇక్కడ శిక్షణ తీసుకున్న మొదటి బ్యాచ్ 5 మహిళలతో మెంటాడ రోడ్‌లో షాపు పెట్టడం జరిగిందని దీని వల్ల ఆదాయం వస్తుందని కుటుంబ పోషణకు ఎంతగానో ఉపయోగపడుతుందని, శిక్షణ తీసుకున్న తర్వాత మాలో ఆత్మ విశ్వాసం పెరిగిందని అన్నారు. ప్రస్తుతం వర్క్ ఆర్డర్లు తీసుకొని కుడుతున్నామని, ఇక్కడ మాకు మీ ద్వారా ప్రొడక్షన్ సెంటర్ మంజూరు



చేస్తే ఇక్కడ శిక్షణ తీసుకున్న 60 మందికి ఉపాధి కల్గుతుందని అన్నారు. తదుపరి డైరెక్టరు గారు మాట్లాడుతూ ఈ శిక్షణ ఇంకా మెరుగ్గా వుండాలంటే ఏమి చేస్తే బాగుంటని అడుగ్గా ప్రస్తుతం ఈ వర్క్ తో పాటు మగ్గాం వర్క్ నేర్పిస్తే బాగుంటుదని దానికి కూడా గిరికి వుందనిఅన్నారు. తదుపరి కురిమిన మాలతి, పురిటిపెంట వారు మాట్లాడుతూ నేర్చుకున్న విధ్య వృదా కాకుండా టైలరింగ్ చేస్తూ మేచింగ్ సెంటర్ నడుపుతున్నాని అన్నారు. ఈ శిక్షణలో మహిళలకు సంబంధించి చిన్న పిల్లల నుండి పెద్ద వారి వరకు ప్రస్తుత కాలానుగునంగా ఫ్యాషన్ డిజైన్ సంబంధంచి మదర్ అండ్ డాటర్ ఫ్రాక్స్, పంజాబి డ్రెస్, అన్నిరకాల బ్లావుజ్ లు, లంగాలు, లెహంగాలు, నేర్పడం జరుగుతుందని భవిష్యత్తులో మా కాళ్ళ మీద మేము నిలబడటానికి ఆత్మ విశ్వాసం ఈ శిక్షణ కల్పించిందని అన్నారు. తదుపరి పైల సునిత, మరుపల్లి వారు మాట్లడుతూ డి.ఆర్.డి.ఎ ద్వారా ఋణం తీసుకొని కుట్టు మిషన్ కొనుక్కొని, కుటుంబాన్ని చూసుకుంటూ ఈ వృత్తిలో రానిస్తున్నాని అన్నారు. ఇక్కడకు హాజరైన అందరూ కూడా ప్రొడక్షన్ సెంటర్ మంజూరు చేస్తే అందరికీ ఉపాధి కల్గుతుందని అన్నారు.

ఈ సందర్భంగా డైరెక్టరు మాట్లాడుతూ కాలానుగుణంగా మీరు దీనిలో మెలుకువలు నేర్చుకొని పెద్ద పెద్ద సంస్థలు నుండి ఆర్డర్లు తెచ్చుకొనే విధంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ శిక్షణ సద్వినియోగం చేసుకున్నందుకు చాలా సంతృప్తిని తెలియజేశారు. తదుపరి పథక సంచాలకులు, డి.ఆర్.డి.ఎ-వై.కె.పి, విజయనగరం ఎ. కళ్యాణ చక్రవర్తి గారు మాట్లాడుతూ మహిళ లందరు ఆర్థికంగా పైకి రావాలని ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం ద్వారా కుట్టు మిషన్‌లకు అవసరమైన రాయితీ ఋణాలు తీసుకొని షాపులు వ్యక్తిగతంగా గాని గ్రూపుగా గాని పెట్టుకోవాలని అన్నారు. భారత్ డైనమిక్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారముతో జిల్లాలో 10 సెంటర్లు పెట్టి సుమారు 600 మందికి రెండు బ్యాచ్లు క్రింద శిక్షణ ఇప్పించడం జరిగిందని అన్నారు. తదుపరి శిక్షణ తీసుకున్న మహిళలు వారి సంతృప్తి మేరకు భారత్ డైనమిక్ లిమిటెడ్ డైరెక్టరు ఫైనాన్స్ ఎన్. శ్రీనివాసులుని, హెచ్ ఆర్. పరిపాలన నుండి ఎన్.సత్యన్నారాయణని సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి.సి.యం.యస్ ప్రతినిధి రమేశ్, జెడి.యం మార్టిన్ లూథర్, ఏరియా కోఆర్డినేటర్ జె.లక్ష్మునాయుడు, ఎ.పి.యం యు. జగదీష్ కుమార్, ఎ.పి.యం యస్.వి.పి ఇందిరాదేవి, ఎ.పి.యం ఎఫ్.పి.ఒ యస్. సత్యవతి, మాస్టర్ ట్రైనర్స్ కర్రి గౌరి మరియు విజయలక్ష్మి, పాల్గొన్నారు.

# పద్మావతి గార్డెన్‌లో ట్రీ హట్స్



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర ఊటీ అరకులోయలో గల పద్మావతి గార్డెన్స్‌లో పర్యాటకుల సౌకర్యార్థం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు డిపార్ట్మెంట్ నిధులతో పగోడా గార్డెన్స్ (ట్రీ హట్స్) నిర్మాణం చేపట్టి ఆరు రూములను అందుబాటులో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గార్డెన్ మేనేజర్ బొంజి బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పర్యాటక సౌకర్యార్థం లగ్జరీ రూములు తయారు చేసి రూమ్‌లో బస చేసిన పర్యాటకులకు కాంప్లిమెంటరీగా బ్రేక్ ఫాస్ట్ మరియు అరకు లోకల్ పర్యాటక ప్రాంతాలను చూపించడం జరుగుతుందని అన్నారు. రూమ్ కావలసినవారు the araku tourism.com లో బుక్ చేసుకోవలసిందిగా ఆయన అన్నారు. ఇదివరకు ఇలాంటి ట్రీ హట్స్ ఉండేవని, ఇవి పర్యాటకులకు చూడడానికే కాకుండా అందులో బస చేయడానికి కూడా అవకాశం ఉండేదని, ఇందులో బస చేసినవారు చాలా ఆనందాన్ని తెలియజేసే వారిని అన్నారు. ఇలాంటి రూముల్లో నైట్ టైం బస చేయడం చాలా ఆనందంగా ఉండేదని పర్యాటకులు ఉత్సాహాన్ని ప్రదర్శించేవారు. అలాంటి ట్రీ హట్స్ హుధూద్ కారణంగా కూలిపోవడం వల్ల మరలా ఇంతవరకు అలాంటి ట్రీ కాటేజ్‌లను నిర్మించలేదని అన్నారు. మరల ఇప్పుడు ఆధునికంగా కొత్తగా రూములు ఏర్పాటు చేయడం వలన ఈ పద్మావతి గార్డెన్స్‌కు మరింత పేరు వచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు.

# బియ్యం వితరణ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు



**విజయనగరం:** రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు, కె.ఆర్.హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ పూర్ణ జంక్షన్ వద్ద గురువారం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ కార్యక్రమం జరిగింది. బడుగు బలహీన వర్గాలు, పేద వర్గాల వారికి చేయూత అందించే క్రమంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా ఉన్నటువంటి తనకు, ప్రజా సమస్యల మీద చేస్తున్నటువంటి పోరాటాన్ని గుర్తించి రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పదవిని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వస్తున్న జీతంలో కొంత భాగం పేద ప్రజల సేవకి ఖర్చు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే గత కొద్ది నెలలుగా కె.ఆర్.హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ రెల్ల జానకిరామ్, విశాఖ జిల్లా అధ్యక్షులు నమ్మి లక్ష్మణ్, సంస్థ వలంటీర్స్ గణేష్ కుమార్, జగన్మోహన్, మాధవ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి భక్తులు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో అంగరంగ వైభవంగా పార్థియాత్ర ఉత్సవాలు నిర్వహించారు



**పుట్టపర్తి, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం జిల్లా భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి భక్తులు పార్థీ యాత్ర ముగింపు కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా మెజిస్ట్రేట్ సాయి కులాంతల్ హాలులో భజన అనంతరం స్వామివారి సమాధి దగ్గర ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు! ఈ కార్యక్రమంలో 6000 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు, ముఖ్యంగా సంస్థ జిల్లా అధ్యక్షుడు పిఆర్ఎస్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక కన్వీనర్ ఎంఎస్ ప్రకాశరావు, రైల్వే ఏరియా కన్వీనర్ పి మోహనరావు సేవాదళ్ కన్వీనర్ రెడ్డి అప్పల్ నాయుడు తదితరులు ఉన్నారు.

# పీఎం విశ్వకర్మ యోజనతో కులవృత్తుల వారికి ఆర్థిక స్వావలంబన



**విజయనగరం:** ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా సంప్రదాయ కుల వృత్తులు, హస్తకళా కారులకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని అర్హులందరికీ ఫలాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు. వృత్తి నైపుణ్యం పెంచి నాణ్యమైన ఉపాధి పొందేందుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం దోహదం చేస్తుందని కావున జిల్లాలోని అర్హత కలిగిన వారందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు. గురువారం తన ఛాంబర్లో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పథకం అమలు, కలిగే ప్రయోజనాలు, అర్హుల గుర్తింపు, శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. స్థానిక సచివాలయాలు, కామన్ సర్వీస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయాలని పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. వీలైనంత మంది అర్హులను పథకంలో చేరేలా ప్రణాళికాయుత కృషి చేయాలని చెప్పారు.

సమీక్షలో భాగంగా విశ్వకర్మ పథకం తాలూక ప్రయోజనాలను, అర్హత ప్రమాణాలను జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్. పాపారావు కలెక్టర్‌కు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన వడ్రంగి, పడవల తయారీ, కవచాలు తయారీ, కమ్మరి, కుమ్మరి, తాళాలు, ఇతర పనిముట్లు తయారు చేసేవారు, స్వర్ణకారులు, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు తయారు చేయువారు, తాపీమేస్త్రీలు, బుట్టలు, చాపలు, చీపుర్లు, బొమ్మలు, ఇతర ఆట వస్తువులు తయారు చేసేవారు, క్షరకులు, పూలదండలు తయారు చేసేవారు, రజకులు, దర్జీలు, చేపల వలల తయారు చేసేవారు అర్హులని పేర్కొన్నారు. మొబైల్ ఫోనుకు లింకైన ఆధార్ కార్డు సాయంతో స్థానిక సచివాలయం లేదా కామన్ సర్వీసెస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. కుటుంబంలో ఒక్కరికే అవకాశం ఉంటుందని అన్ని అర్హతలు సరిపోయినట్లయితే విశ్వకర్మ సర్టిఫికేట్ అందజేస్తామని అలా పొందిన వారికి ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో రూ.500 భృతితో పాటు రూ.15,000 విలువ కలిగిన టూల్ కిట్ అందజేస్తామని వివరించారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.1లక్ష బ్యాంకు లోను ఐదు శాతం వడ్డీపై పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 15 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందిన వారికి ఐదు శాతం వడ్డీపై రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. మొదటి విడత రుణం 18 నెలల్లో, రెండో విడత రుణం 30 నెలల్లో తీర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీ పథకాలు పొందిన వారు అనర్హులని పరిశ్రమల శాఖ జీఎం స్పష్టం చేశారు.

సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆర్. పాపారావు, మెప్మా పీడీ సుధాకర్, జడ్పీ సీఈవో రాజ్ కుమార్, డీపీవో శ్రీధర్ రాజా, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గోవిందరావు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్డీఏ, మత్స్యశాఖ, బ్యాంకు అధికారులు, పరిశ్రమల శాఖ ఐపీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ విద్యామందిర్‌లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక వి.ఎస్.రావు శ్రీకృష్ణ విద్యామందిర్ ద్వారకానగర్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలనంతో శ్రీకృష్ణ భగవానుని పూజతో కార్యక్రమం ప్రారంభమయింది. ఉదయం 8 గం॥ల నుండి పూజా కార్యక్రమంతో మొదలు పెట్టి కృష్ణ గీతాలు, కృష్ణ భజనలు, పారిజాతాపహరణం, గీతాసారం, భక్త ఉద్దాలకుడు, గయోపాఖ్యానం వంటి అంశములను గూర్చి విద్యార్థులు వీనుల విందుగా పోటీ పడి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా డా॥ కందాళ కనకమహాలక్ష్మి, దేవాదుల కామేశ్వరీ హేమసుందర్ విచ్చేశారు. వారు కృష్ణాష్టమి ప్రాముఖ్యతను తెలియజేశారు.

అనంతరం మధ్యాహ్నం "నారాయణీయమ్" కార్యక్రమం 3:30ని॥లకు ప్రారంభమయింది. రుక్మిణీ కళ్యాణం, శ్రీకృష్ణరాయబారం, కాళీయమర్దనం, నరకాసుర వధ వంటి పలు సన్నివేశాలు విద్యార్థులు ప్రదర్శించారు. సాయంత్రం "బాలగోకులం" కార్యక్రమం నిర్వహించబడింది. పలువురు చిన్నారులు శ్రీకృష్ణ వేషధారణతో, గోపికల వేషధారణతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమానికి డా.జె.వి.ఎస్.ఎన్.మూర్తి, వై.శ్రీధర్, మోహన్‌రావు న్యాయనిర్ణేతలుగా విచ్చేశారు. ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ విద్యామందిర్లో మన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తామని, కృష్ణాష్టమి ప్రాముఖ్యతను, కృష్ణ తత్వాన్ని గురించి, భగవద్గీత ప్రాశస్త్యాన్ని గూర్చి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.నర్మద తెలిపారు.

# కృష్ణుని దర్శించుకున్న టీడీపి రాష్ట్ర కార్యదర్శి బండారు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెన్నెలపాలెం పంచాయితీ పరిధి గొల్లలపాలెం లో గురువారం శ్రీకృష్ణాష్టమి. పండుగను ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు కృష్ణుని దర్శనం చేసుకొని పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పైల రథల సన్యాసిరావు, గోపాలకృష్ణ, అభి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మక నిపుణుల కోసం వెస్ట్రన్ డిజిటల్ డబ్ల్యుడీ బ్లూ 'ఎస్ఎన్580 ఎన్వీఎంఈ' ఎస్ఎస్డీ పరిచయం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రపంచంలో విజువల్ బ్రిలియెన్స్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్‌కు డిమాండ్ పెరుగుతుందని, అందుకు తగ్గట్టు సృజనాత్మక నిపుణుల కోసం వెస్ట్రన్ డిజిటల్ డబ్ల్యుడీ బ్లూ 'ఎస్ఎన్580 ఎన్వీఎంఈ' ఎస్ఎస్డీ పరిచయం చేస్తున్నట్లు వెస్ట్రన్ డిజిటల్ సీనియర్ డైరెక్టర్ సేల్స్ (ఇండియా) ఖలీద్ వానీ తెలిపారు. రిచ్ కంటెంట్ ఉత్పత్తి, వినియోగానికి మద్దతు ఇచ్చే అధునాతన సాంకేతికతలకు ఇది మార్గం సుగమం చేస్తోందన్నారు. వినియోగదారులు, విద్యార్థులు, నిపుణుల కోసం, వారి ఊహలను ప్రవహింపజేయడానికి వేగవంతమైన, నమ్మదగిన సాధనాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అవార్డు-విజేత ఎస్ఎస్డీ పోర్ట్‌ఫోలియో ఆధారంగా వెస్ట్రన్ డిజిటల్ డబ్ల్యుడీ బ్లూ 'ఎస్ఎన్580 ఎన్వీఎంఈ' సాలిడ్ స్టేట్ డ్రైవ్ (ఎస్ఎస్డీ)ని విడుదల చేశామన్నారు. ఇది ఎన్వీఎంఈ పీసీఐఈ (ఆర్) జెన్ 4.0 అంతర్గత ఫ్లాష్ డ్రైవ్ అనేది ప్రస్తుత పీసీలను అప్‌గ్రేడ్ చేసేటప్పుడు లేదా కస్టమ్ బిల్డ్‌ను ఎలివేట్ చేసేటప్పుడు సృజనాత్మక ఔత్సాహికుల సంఘం నిపుణుల కోసం ఉద్దేశించబడిందన్నారు. భారతదేశంలో లీనమయ్యే డిజిటల్ కంటెంట్‌కు డిమాండ్ పెరుగుతున్నందున, అధిక-పనితీరు గల సాధనాల అవసరం కూడా పెరుగుతుందన్నారు. ఇది సుదీర్ఘ లోడ్ సమయాలను గతానికి సంబంధించినదిగా మారుస్తుందన్నారు. దీని స్లిమ్ ఎం.2 ఫారమ్ ఫ్యాక్టర్ 2టీబీ వరకు కంటెంట్‌ను కలిగి ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల పరిమిత వారంటీ కలదన్నారు.

# ప్రముఖ రచయిత త్రిపురనేని గోపీచంద్ జయంతి. (సెప్టెంబర్ 8)

త్రిపురనేని గోపీచంద్ సంపూర్ణ మానవతావాది, తెలుగు రచయిత, హేతువాది, సాహితీవేత్త, తెలుగు సినిమా దర్శకుడు.

గోపీచంద్ 1910, సెప్టెంబర్ 8 న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామములో జన్మించాడు. ఈయన తండ్రి ప్రముఖ సంఘ సంస్కర్త త్రిపురనేని రామస్వామి. గోపీచంద్ తన జీవితంలో చాలా సంఘర్షణను అనుభవించాడు. అనేక వాదాలతో వివాదపడుతూ, తత్వాలతో దాగుడుమూతలాడుతూ, సంతృప్తిలోనూ అసంతృప్తిలోనూ ఆనందాన్నే అనుభవిస్తూ జీవయాత్ర కొనసాగించాడు. తన తండ్రి నుంచి గోపీచంద్ పొందిన గొప్ప ఆయుధం, ఆస్తి, శక్తి ఎందుకు? అన్న ప్రశ్న. అది అతన్ని నిరంతరం పరిణామానికి గురిచేసిన శక్తి. అతనిలోని అరుదైన, అపురూపమైన, నిత్య నూతనమైన అన్వేషణాశీలతకి ఆధారం. ఎందుకు? అన్న ప్రశ్నే అతన్ని ఒక జిజ్ఞాసువుగా, తత్వవేత్తగా నిలబెట్టింది. ఈ క్రమంలో అతనిలో చెలరేగిన సంఘర్షణ అతని నవలలన్నింటిలోనూ ప్రతిఫలించింది.

గోపీచంద్ రచనలలో విలువల మధ్య పోరాటం ముఖ్యముగా చెప్పుకోతగినది. ఆయన వ్రాసిన అసమర్థుని జీవయాత్ర తెలుగులో మొదటి మనో వైజ్ఞానిక నవల. 1963లో పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

హేతువాద నాస్తికత్వపు భావజాలాల వాతావరణంలో పెరిగిన గోపీచంద్ పై వాటి ప్రభావం సహజంగానే పడింది. అయితే తరువాతి కాలంలో ఆయన ఆస్తికుడిగా మారాడు.

1932 లో వివాహం 1933లో బి,ఏ పట్టా, ఆ తర్వాత లా డిగ్రీ. కొంతకాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీసు పెట్టినా ఆ వృత్తిలో ఇమడలేక పోయాడు. ఈ దశలో ఆయన కమ్యూనిజం (మార్క్సిజం) పట్ల ఆకర్షితుడయ్యాడు. కానీ అందులోని అరాచకత్వం ఆయనకు నచ్చలేదు.

ఆ తర్వాత ఎం.ఎన్.రాయ్ మానవతావాదం ఆయన పై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఈ



కాలంలో ఆయన ఆంధ్రా రాడికల్ డెమొక్రటిక్ పార్టీ కార్యదర్శిగా పనిచేసాడు.

1928లోనే శంబుక వధ కథ ద్వారా సాహిత్యరంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ 1938లోపట్టాభి గారి సోషలిజం అన్న పుస్తకాన్ని వెలువరించాడు.

తొలుత కథా సాహిత్యంలో స్థిరపడ్డ గోపీచంద్ ఆ తర్వాత నవలా సాహిత్య రంగంలోకి అడుగుపెట్టాడు. ఆయన తొలి నవల పరివర్తనం (1943).

1939లో చలనచిత్ర రంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ దర్శక నిర్మాతగా కొన్ని చిత్రాలను నిర్మించాడు. అయితే వాటివల్ల ఆర్థికంగా చాలా నష్టపోయారు.

1953లో ఆంధ్రరాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్‌గా, 1956లో ఆంధ్ర ప్రదేశ్ సమాచార శాఖ సహాయ డైరెక్టర్‌గా పనిచేసాడు.

1957-62 వరకు ఆకాశవాణిలో పనిచేసాడు. ఈ దశలో అరవిందుని భావాల పట్ల విశ్వాసం ఏర్పడడంతో ఆధ్యాత్మికవాదం వైపుకి పయనించాడు.

గోపీచంద్ చిన్నతనములోనే తల్లిని పోగొట్టుకున్నాడు. ఇంటి పనులతోపాటు, తండ్రి నాస్తికోద్యమము నకు సహాయము చేయటం లాంటి పనులతో అతని బాల్యం చాలా గడచి పోయింది. అటు తర్వాత, మద్రాస్ లో లా చదువుకున్నాడు. అతని మీద చాలా కాలము ఆయన నాన్న ప్రభావం ఉండేది. ఆయన మొదట వ్రాసిన చాలా నవలలో మార్క్సిస్టు భావాలు మనకు పూర్తిగా కనిపిస్తాయి.

ఆయన వ్రాసిన "మెరుపుల మరకలు" అనే గ్రంథంలో గాంధీరామయ్య అనే ఒక పాత్ర ఉంది. ఆ పాత్ర శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులును పోలి ఉంటుందన్నది కొందరి భావన. రామస్వామి, పంతులు మంచి స్నేహితులు. రెండు భిన్న ధ్రువాలు. ఒకరు కరుడుగట్టిన నాస్తిక వాది, మరి ఒకరు పూర్తి ఆస్తికులు. ఇద్దరూ గాంధేయవాదులు. రామస్వామికి యవ్వనంలోనే భార్య గతించింది. పునర్వివాహం చేసుకోలేదు. ఒక రోజు పంతులు రామస్వామిని కలవటానికి తెనాలి వెళ్ళాడు. స్నేహితులిద్దరికి గోపీచంద్ భోజనం వడ్డిస్తున్నాడు. ఆ సందర్భములో, పంతులు "ఏమయ్యా! రామస్వామి నీవు ఉద్యమాలలో పూర్తిగా మునిగి, కుమారుడి వివాహము సంగతే మర్చిపోయావు" అని అన్నాడు. అప్పుడు, రామస్వామి, నిజమే పంతులు, ఆ విషయము పూర్తిగా మరచిపోయాను. మీరే ఏదైనా మంచి అమ్మాయిని చూసి వాడికి పెళ్ళి చెయ్యండి అని అన్నాడట. అప్పుడు. పంతులు,గోపీచంద్‌తో, "నీవు మద్రాస్ వెళ్ళే లోపు ఒక పది రోజుల ముందు, గుంటూరు రా.." అని అన్నాడు. గోపీచంద్, సరే అనటం, అలాగే గుంటూరుకు వెళ్ళటం జరిగింది.

ఆ రోజుల్లో గుంటూరులో "శారదా నికేతన్" అనే వితంతు శరణాలయం ఉండేది. ఇప్పుడు కూడా ఉంది. దాని నిర్వహణ బాధ్యత అంతా ఆ రోజుల్లో పంతులు గారే చూసుకునే వారు. ఆ రోజుల్లో అన్నీ బాల్యవివాహాలు కావటం చేత, వధూవరులకు వయోభేదం ఉండటం చేత అక్కడ ఉన్నవారిలో కూడా చాలామంది బాలవితంతువులే! గోపీచంద్ వచ్చి పంతులుని కలసి, ఎందుకు రమ్మన్నారో చెప్పమని అడిగారు. పంతులు ఏ విషయము చెప్పకుండా, నీకు నచ్చిన ఒక క్లాసుకు వెళ్లి ఒక పది రోజులు పాఠాలు చెప్పమన్నారు. ఆ వితంతు శరణాలయాన్ని పంతులు నడుపుతున్న తీరు, బాలవితంతుల దీన పరిస్థితి గోపీచంద్ పై తీవ్ర ప్రభావం చూపాయి. ఆయన రచనలలో కొన్నింటిలో వాటి ప్రభావం కనపడుతుంది. కాలక్రమంలో గోపీచంద్ మీద ఆయన నాన్న ప్రభావం తగ్గనారంభించింది. స్వతంత్ర భావాలను పెంచుకున్నాడు. జీవితములో పెంచి పెద్ద చేసిన నాన్న కంటే పంతులు ప్రభావం అతని మీద చాలావరకు ఉంది. అందుకే, గాంధీ రామయ్య పాత్ర సజీవంగా నిలిచిపోయింది.

గోపీచంద్ నెమ్మదిగా మార్క్సిస్టు సిద్ధాంతం నుండి బయటపడి, చివరి రోజులలో తత్వవేత్తలు అనే తాత్విక గ్రంథాన్ని వ్రాయటం జరిగింది. పోస్ట్ చెయ్యని ఉత్తరాలు, అసమర్థుని జీవయాత్ర, మెరుపుల మరకలు - ఈ గ్రంథాలలో కూడా చాలావరకు తాత్విక చింతన కనపడుతుంది. ఆయనే, ఒక చోట ఇలా అంటాడు, "మానవులు జీవనదుల లాగా ఉండాలి కానీ, చైతన్యంలేని చెట్లు, పర్వతాల లాగా ఉండకూడదు". మానవ జీవితం ఒక చైతన్య స్రవంతి. ఎన్నో మలుపులు తిరుగుంది. అలాగే మనం కూడా నిరంతర అన్వేషణలో ఉండాలి. అప్పుడే మనకు సత్యమంటే ఏమిటో తెలుస్తుంది. నిన్న మనం నమ్మింది ఈ రోజు సత్యం కాదని తెలిసిన వెంటనే దాన్నివదలి మళ్ళీ అన్వేషణ సాగించాలి. ఇదే విషయాన్ని జిడ్డు కృష్ణమూర్తి, చలం కూడా చెప్పారు. జీవితం అంటే నిరంతర అన్వేషణ. ఒక పుస్తకాన్ని ఆయన తండ్రిగారికి అంకితం ఇస్తూ- 'ఎందుకు' అని అడగటం నేర్పిన నాన్నకి అని వ్రాసాడు. అలా నేర్చుకోబట్టే స్వతంత్ర భావాలు గల ఒక గొప్ప రచయిత స్థాయికి ఎదిగాడు.

భారత ప్రభుత్వము 2011 సెప్టెంబరు 8న గోపీచంద్ శతజయంతి సందర్భమున తపాలా బిళ్ళ విడుదల చేసింది.

1962 నవంబర్ 2 నాడు గోపీచంద్ మరణించాడు

**డా. జె. వి. ప్రమోద్ కుమార్, పైడిమెట్ట**

## ఘనంగా వివేకానంద సంస్థలో 2 వ రోజు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ వారు 2 వ రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కూడా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సంస్థ వారు ఘనంగా నిర్వహిస్తారు. 2 వ రోజులో భాగంగా, యువ నాయకులు శ్రీ ద్రోణం రాజు. శ్రీ వాత్సవ గారు శ్రీకృష్ణ భగవానుని దర్శించుకున్నారు, అలాగే వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ .జహీర్ అహ్మద్ గారు, వాల్తేర్ రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు మక్సుద్ అహ్మద్ గారు శ్రీకృష్ణ భగవానుని దర్శించుకున్నారు. మధ్యా హ్నం 12 గంటలకు వివేకానంద సంస్థ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## యశోద కృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈరోజు 25వార్డు సీతమ్మపేట జంక్షన్ వద్ద శ్రీ యశోద కృష్ణ సేవాసంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలలో ముఖ్య అతిధిలుగా నగర్ మేయర్ శ్రీమతి గొలగాని హరివెంకట కుమారి గారు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర నెడ్క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, 25 వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు చీరలు పంపిని చేసారు.ఈ కార్యక్రమంలోముద్దాడ.యెల్లాజీ, ముద్దాడ.శంకర్, బీసపు శ్రీను,ఒమ్మి ఆనంద్ పల్ల.గోవింద్ నాయుడు మాస్టారు బి.గోవింద్,శ్రీ యశోద కృష్ణ సేవా సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి గ్లోబల్ స్కూలులోశీ కృష్ణాష్టమి వేడుకలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** సంస్కృతీ గ్లోబల్ స్కూల్ నందు శ్రీకృష్ణ జన్మష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

చిన్నారులు శ్రీ కృష్ణుడు, రాధ వేషధారణల తో సందడి చేస్తూ కృష్ణా -రాధ ల నృత్య ప్రదర్శనతో ఆకట్టు కొన్నారు

ఉట్టి కొట్టే సంబరంలో చిన్నారులు సంప్రదాయం దుస్తులలో ఉత్సహం గా పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతు.. శ్రీ కృష్ణుడు యావత్తు ప్రపంచానికి గీతోపదేశం చేసిన సర్వ శ్రేష్ఠుడని, చిరు నవ్వు, సమయ స్ఫూర్తి, చతురత , స్నేహితుల పట్ల ఆత్మీయత, ఆయుధం పట్టకుండా యుద్ధం గెలిచే యోధుడని.. తను బోధించిన గీతోపదేశంలో ఉన్న నైతిక విలువలు మీరు బాల్యం నుండి నేర్చుకొంటే సమాజంలో ఉన్న అంతరాలు తొలిగి బావి భారతవని వన్నె తెచ్చిన వారు అవుతారు అని అన్నారు.

సీఈఓ కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి లు ఈ కార్యక్రమం ను నిర్వహించిన ప్రైమరీ టీచర్లు ప్రియాంక,అరుణ, రామన్ కౌర్,శిరీష, ఉమా, లీలా,కల్చరల్ ఇన్ ఛార్జ్ పూజిత లను అభినందనలు తెలిపారు.

## అనకాపల్లి మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల జట్ల ఎంపిక

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈనెల 12 నుండి15 తేదీల్లో అనకాపల్లి మండలంలో గల అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 , 11 విభాగాలలో విద్యార్థినీ విద్యార్థులకు వేరేవేరుగా తొమ్మిది క్రీడాంశాలలో క్రీడా పోటీలు నిర్వహించి మండల టీములను ఎంపిక చేయడం జరుగుతుందని మండల స్థాయి స్కూల్ గేమ్స్ కన్వీనర్ ఎస్వి నరసింహం తెలియజేశారు. ఈ పోటీలు ఖో ఖో, కబడ్డీ, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాట్మెంటన్, యోగ మరియు అథ్లెటిక్స్ క్రీడాంశాలలో బాల బాలికలకు వేరువేరుగా పోటీలు జరుగుతాయని తెలియజేశారు. పోటీల్లో పాల్గొని విద్యార్థులు తమ యొక్క ఎస్ జి ఎఫ్ ఎలిజిబిలిటి పత్రంతోపాటు ఎండిఎం ఎక్విటెన్స్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలియజేశారు. ఇతర వివరముల కొరకు 9247150037 సంప్రదించవలసిందిగా ఎస్వి నరసింహం తెలియజేశారు.

# జోరు వానలోనూ సాగిన గడపగడపకు మన ప్రభుత్వం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పేదలకు ప్రభుత్వ పథకాలను నిర్విఘ్నంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం జోరు వానలోను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక గాంధీనగర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. స్థానికులు తమకు టిట్కో ఇల్లు మంజూరు చేయాలని మంత్రి అమర్నాథ్ ను కోరగా, దసరా నాటికి ఇల్లు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అలాగే గాంధీ నగర్‌లోని స్థానిక సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కొండూరు రవీంద్రనాథ్ నేతృత్వంలో పలువురు మంత్రి అమర్నాథ్ సమక్షంలో వైసీపీలో చేరారు. అమర్నాథ్ తొలుత పార్టీ పథకాన్ని ఆవిష్కరించి, అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాగా 82వ వార్డులోని ఇన్కమ్ టాక్స్ స్ట్రీట్ లో 10.50 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లు, ఆర్సీసీ కన్వర్టర్ల పనులకు మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి పట్టణాన్ని పూర్తిస్థాయిలో ఆధునికరించి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తామని చెప్పారు. గత ప్రభుత్వాలు అనకాపల్లి పట్టణ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనకాపల్లి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఆయన అన్నారు. అనకాపల్లి సమీపంలో ఆటోనగర్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతేకాకుండా పలు పెద్ద పరిశ్రమలను అనకాపల్లికి తీసుకొస్తామని ఏర్పాటు చేస్తున్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని, వీటిలో కూడా స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అమర్నాథ్ చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే, అనకాపల్లి పట్టణాన్ని అన్ని రంగాలలో నెంబర్ వన్ స్థానంలో నిలుపుతామని చెప్పారు.





అనంతరం నెహ్రూ చౌక్ నుంచి గుండాల వీధి వరకు 141లక్షల రూపాయలతో నిర్మించనున్న తారు రోడ్డుఫుట్పాత్ డ్రైన్స్ పనులకు మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమీషనర్ వెంకటరమణ , వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, స్థానిక ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్. రామమూర్తి, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# "రవీంద్ర భారతి పాఠశాలలో అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు"

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక రవీంద్ర భారతి అనకాపల్లి దాసరి గెడ్డ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టి కన్నయ్యలు,చిన్నారి గోపికల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల ఆవరణ అంతటా బృందావనాన్ని మైమరిపించేలా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా రాధాకృష్ణుల ప్రతిమలకు ఉయ్యాలలూపి వేడుకను ప్రారంభించారు. పాఠశాలలో ఉట్టిమహోత్సవంలో భాగంగా ఉట్టిని కొట్టేందుకు పాఠశాల చిన్నారులు ఎంతో పోటీపడ్డారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పిందని, కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఈ కృష్ణాష్టమి అని, దుష్టశిక్షణ శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం చేసిన కృష్ణభగవానుడు మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన అని తెలియజేస్తూ రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ యం.యెస్.మణి కృష్ణాష్టమి శుభాకాంక్షలను తెలియజేసారు.భాగవతం మన సంస్కృతి సాంప్రదాయాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ వేడుకలు అద్దం పడతాయని తెలుపుతూ, చిన్నారులకు చిలిపికృష్ణుడుగా, తల్లులకు బాలకృష్ణుడుగా, పెద్దలకు గీతాకారునిగా శ్రీకృష్ణుడు మనందరికీ ధర్మ సందేశాన్ని అందించారని ఉత్తరాంధ్ర రవీంద్రభారతి పాఠశాలల ఇన్చార్జ్ ఎన్.వెంకటేష్ తెలిపారు. ద్వాపరయుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన్ను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తున్నారు. వివిధ రూపాల్లో, సంప్రదాయాలతో భక్తిప్రపత్తులతో కృష్ణుడిని కొలుస్తున్న ఆయా రాష్ట్రాల వారి సంప్రదాయాలు మన భారతీయ సంస్కృతికి విలక్షణమైన అందాన్ని తెస్తాయి ఏజీఎం జి వి ఎస్ ఎన్ మూర్తి గారు మరియుపాఠశాల ప్రిన్సిపాల్ ఎం.జగదీష్.అన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు శ్రీకృష్ణుని చెరసాలలో



జననం అనే నాటక ఘట్టం, శ్రీకృష్ణుని బాల్య క్రీడలు ఎంతో కనువిందు చేసాయి. ఇంత గొప్ప వేడుకను నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమములో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విలాసాలకు అలవాటుపడి కర్కశంగా మారిన మహిళలు

ఒంగోలు: ఆ మహిళల భర్తలు మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబానికి సరిపడా ఆదాయం ఆర్జిస్తున్నారు. అయితే ఆ మహిళలకు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారు. భర్తల సంపాదన కన్నా ఈజీగా డబ్బు సంపాదించేందుకు చోరీలే మార్గాలుగా ఎంచుకున్నారు. అందుకు ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకున్నారు. రెండు సార్లు సక్సెస్ అయ్యారు. అయితే వీళ్ల చేసిన చిన్న పొరపాటు మూడోసారి పోలీసులకు చిక్కేలా చేసింది. దీంతో ప్రస్తుతం కటకటాలపాలై ఊచలు లెక్కబెడుతున్నారు. ఇప్పటికే ఈ తరహా నేరాలు చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నారు. తాజాగా ఒంగోలు కృష్ణానగర్‌లో ఓ బ్యాటీషియన్ పగలు ఒంటరిగా ఉంటుందని, ఆమె దగ్గర బంగారం ఎక్కువగా ఉందని మరో బ్యూటీషియన్ ద్వారా వివరాలు సేకరించారు. అంతే ఎప్పటిలాగే తమ ప్లాన్ అమలు చేసేందుకు రంగంలోకి దిగిపోయారు ఈ మాయల మరాఠీలు. బ్యూటీషియన్ రజియాపై బాత్రూమ్ యాసిడ్‌తో దాడి చేసి, మత్తుమందు ఇచ్చి బంగారం, డబ్బు ఎత్తుకెళ్లారు. అయితే ఇక్కడ ఈ మహిళలు చేసిన ఓ పొరపాటు గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకునేలా చేసింది. దీంతో ఈ ముగ్గురి గుట్టు రట్టయింది.

**ప్లాన్ ఒకరిది యాక్షన్ ముగ్గురిది**

ఒంగోలులో కొత్త తరహా నేరాలకు తెరలేపారు నలుగురు మహిళలు. మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే బ్యూటీపార్లర్లపై కన్నేశారు. అందుకు అనువుగా ఉన్న ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో ఉన్న ఓ బ్యూటీపార్లర్‌ను ఎన్నుకున్నారు. ఈ బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది రజియా అనే ఒక మహిళగా నిర్ధారించుకున్నారు. రజియా భర్త ఉద్యోగానికి బయటకు వెళితే తిరిగి సాయంత్రమే ఇంటికి వస్తారని, ఇంట్లో ఇక ఎవరూ ఉండరని ముందుగానే పథకం ప్రకారం తెలుసుకున్నారు. ఈ సమాచారం ఇచ్చింది కూడా మరో బ్యూటీపార్లర్ నడుపుతున్న దాసరి భాను అనే మహిళే. ఈ ప్రకారం తమ ప్లాన్ అమలు చేసేందుకు రంగంలోకి దిగారు ఆ నలుగురు. చోరీకి ప్లాన్ చేసింది దాసరి భాను అనే బ్యూటీషియన్ అయితే ఆ ప్లాన్ను అమలు చేసేందుకు మరో ముగ్గురు మహిళలు యాక్షన్‌లో దిగారు.ఆ ముగ్గురు మహిళలు. మేకప్ చేయించుకుంటామంటూ రజియా నిర్వహించే బ్యూటీపార్లర్‌లోకి ఆ ముగ్గురు మహిళలు వచ్చారు. వీరిలో ఒకరు ఫేషియల్ చేయించుకున్నారు. మరో మహిళ ఐ బ్రోస్ చేయించుకున్నారు. ముగ్గురిలో ఓ మహిళ తాను బాత్రూంకు వెళ్ళింది. బాత్రూమ్ నుంచి బయటకు వస్తూనే ఆ మహిళ తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌తో రజియాపై దాడి చేసింది. యాసిడ్ దాటిలో రజియాకు స్వల్ప గాయాలయ్యాయి. యాసిడ్ ముఖంపై పడటంతో గాయాలపాలైన రజియాను పట్టుకున్న మరో ఇద్దరు మహిళలు ఆమె ముఖంపై క్లోరోఫాం మత్తు మందు కలిపిన కర్చీఫ్‌తో అదిమిపెట్టారు. అయితే రజియా ప్రతిఘటించడంతో ఆమె నోట్లో యాసిడ్ పోసేందుకు ప్రయత్నించారు. అనంతరం రజియాను ముగ్గురు మహిళలు నిర్బంధించి బీరువాలో ఉన్న 18 సవర్ల బంగారు ఆభరణాలు, అలాగే కౌంటర్లో ఉన్న 40 వేల నగదు తీసుకుని ముగ్గురు పరారయ్యారు. ఆ తరువాత కొద్ది సేపటికి స్పృహ కోల్పోయిన రజియాను గుర్తించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**24 గంటల్లో ఛేధించిన పోలీసులు**

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుల్ని గుర్తించేందుకు సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించారు. నిందితులైన ముగ్గురు మహిళల ఆచూకీని కనిపెట్టేందుకు ప్రయత్నించే క్రమంలో ఈ ముగ్గురు మహిళా నిందితుల



గురించిన క్లూ పోలీసులకు లభించింది. అసలు ఈ ముగ్గురు మహిళలు మరో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న దాసరి భాను అనే మహిళ ఇచ్చిన రిఫరెన్స్‌తో బాధితురాలు రజియా దగ్గరకు వచ్చినట్టు తెలుసుకున్నారు. బ్యూటీషియన్ దాసరి భానును అదుపులోకి తీసుకోవడంతో ఈ ముగ్గురు నిందితుల ఆచూకీ తెలిసిపోయింది. దీంతో నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులైన ముగ్గురు మహిళలు ముంద్రు లక్ష్మి నవత, ఎ. నవ్య, కరణం మోహన దీప్తి, లహరి అపర్ణలతో పాటు ఈ చోరీకి ప్లాన్ చేసిన మరో బ్యూటీషియన్ దాసరి భానును పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితుల భర్తలు మంచి ఉద్యోగాలు చేస్తుండటం గమనార్హం. అయినా ఈ ముగ్గురు విలాసాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నారని గుర్తించారు. వీరిని అరెస్ట్ చేయడంతో గతంలో చేసిన నేరాల చిట్టా కూడా బట్టబయలైంది. నిందితుల నుంచి 10 సవర్ల బంగారు నగలు, 40 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పి మలికగార్గ్ తెలిపారు.

**సిబ్బందికి ఎస్పి అభినందన**

ఒంగోలులో కలకలం సృష్టించిన బ్యూటీపార్లర్ నిర్వాహకురాలిపై దాడి, చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేధించి నలుగురు మహిళా నిందితులను అరెస్ట్ చేయడంతో పోలీసు సిబ్బందిని ఎస్పి మలికగార్గ్ అభినందించారు. నేరం జరిగిన ప్రాంతంలో లభించిన సిసి కెమెరా ఫుటేజ్, సాంకేతిక సమాచారంతో సేకరించిన ఇతర ఆధారాలతో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చోరీకి గురైన సొత్తును రికవరీ చేసిన పోలీసు సిబ్బందికి ఎస్పి రివార్డులు అందించారు.

# మంచంపై నుండి పడిపోయిన మహిళకు సహాయమందించిన అగ్నిమాపక సిబ్బంది

ముంబాయి, సెప్టెంబర్ 7: మంచం మీద నుంచి కింద పడితే మీరైతే ఏం చేస్తారు అటూఇటూ చూసి ఎవరూ చూడకపోతే లేచి మళ్లీ మంచం ఎక్కేస్తారు అంతే కదా కానీ ఓ మహిళ అనుకోకుండా మంచం మీద నుంచి కింద పడిపోయిందండి. అంతే జిల్లా మొత్తం ఉలిక్కిపడింది. అదేంటని అనుకుంటున్నారా? అవునండీ, ఆవిడను తిరిగి మంచం మీదకు ఎక్కించడానికి కుటుంబ సభ్యులు ఏకంగా అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. ప్రమాదవశాత్తు మంచం మీద నుంచి కింద పడిపోయిన మహిళను తిరిగి మంచం మీదకు చేర్చడానికి ఇంత హడావిడి అవసరమా అని అనుకుంటున్నారా? అసలు కారణం తెలిస్తే మీరు కూడా ఔరా అనేస్తారు. అసలింతకీ ఏం జరిగిందంటే మహారాష్ట్రలోని థానే పట్టణానికి చెందిన 62 ఏండ్ల మహిళ బరువు దాదాపు 160 కేజీలు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంచానికే పరిమితమైంది. కదలిక లేకుండా మంచంపైనే ఉండేది. ఈ క్రమంలో వాగ్‌బిల్ ప్రాంతంలోని వారి ఫ్లాట్‌లో గురువారం (సెప్టెంబర్ 7) ఉదయం 8 గంటలకు మంచంపై నిద్రిస్తున్న సమయంలో ఆమె ప్రమాదవశాత్తు మంచం మీద నుంచి కింద పడిపోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆమెను పైకి లేపి మంచంపై పడుకోబెట్టేందుకు కుటుంబ సభ్యులు విశ్వప్రయత్నం చేశారు. దీంతో చేసేది లేక ఆమె కుటుంబ సభ్యులు థానే మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సహాయం కోరారు.

మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఆమె ఆ ఇంటికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కింద పడ్డ మహిళను మంచంపై తిరిగి పడుకోబెట్టారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్ చీఫ్ యాసిన్ తాడ్వి మాట్లాడుతూ రీజనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్ (ఆర్‌డీఎంసీ)కి చెందిన బృందం ఫ్లాట్‌కు చేరుకుని, మహిళను పైకి లేపి మంచంపై పడుకోబెట్టారు. బాధిత మహిళకు ఎలాంటి గాయాలు కాలేదు.



ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆయన తెలిపారు. సాధారణంగా ఆర్‌డీఎంసీకి ఎన్నో ఎమర్జెన్సీ కాల్స్ వస్తుంటాయని, ఇలాంటి ఫోన్ కాల్ రావడం ఇదే తొలిసారంటూ మీడియాకు తెలిపారు.

# శ్రీ నూకాంబిక బాలాలయంలో పూజలు ప్రారంభించిన మంత్రి అమర్నాథ్ దంపతులు

## నేటి నుండి నూకాంబిక ఆలయ పునర్నిర్మాణం పనులు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానంలో గురువారం నుండి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఆలయ మండపంలో ఆగమపండితులు రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో కలశ పూజ, గోపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సతీసమేతంగా అమ్మవారి ఆలయానికి వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన మంత్రిని నూకాంబిక ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ ఆలయ సాంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఆలయ పునర్నిర్మాణ సందర్భంగా ఆలయ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో పండితులు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలు మధ్య నూకంబిక అమ్మవారు ఉత్సవమూర్తిని ప్రత్యక్ష చేశారు. తొలి పూజ ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ దంపతులు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి దంపతులకు ఆలయ చైర్మన్ ,ఈవో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్ , అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ రామ్మూర్తి, వైఎస్ఆర కాంగ్రెస్ పార్టీ నాయకులు మందపాటి జానకిరామరాజు,దాడి జైవీర్, జాజుల రమేష్, ఆలయ ధర్మకర్తలు పీలా లక్ష్మి శ్రీనివాసరావు, కంటపల్లి శోభారాణి వెంకట్రావు,బుద్ధ నర్సింగరాజు, కొండూరి రవీంద్రనాథ్, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, మల్లవరపు ఈశ్వరరావు వై శ్రీనివాసు శ్రీ భోగ లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ కేఎం నాయుడు, వేగి త్రినాధ, పివి జగన్మోహన్రావు, గైపూరి రాజు, దాడి నారాయణరావు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఉపమాక ఆలయంలో ఘనంగా జరిగిన కృష్ణాష్టమి వేడుకలు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.శ్రావణమాసంలో కృష్ణపక్షంలో రోహిణి నక్షత్రంతో కూడిన అష్టమి నాడు నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించి గురువారం ఉదయం ఆలయంలో అర్చకులు నిత్య కార్యక్రమములు పూర్తి చేశారు. అనంతరం గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులకు యశోదా దేవి అలంకరణ పూర్తి చేశారు.యశోద దేవి అమ్మవారిగా అమ్మవారు ఒడిలో శ్రీకృష్ణ పరమాత్మ ఉగ్గుపాలు తాగుతూ ఉండే సన్నివేశంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు అర్చకులు భాగవతం గోపాల ఆచార్యులు అలంకరణ చేశారు.సాయంత్రం ఐదున్నర గంటలకు ఆలయం ప్రాంగణంలో ముందుగా గోపూజ ఉత్సవాన్ని నిర్వహించారు.అనంతరం ఆలయంలో గల అలంకరణ మూర్తులకు వెంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు, నారద మహాముని ప్రతిష్ఠతమైన ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామివారి ధ్రువమూర్తులకు, ఉత్సవమూర్తులకు వరుసగా దూపహారతి, చంద్ర హారతి, గరుడ హారతి, నక్షత్ర హారతి, వనమాల హారతి, గజ హారతి, కుంభహారతి, పేట హారతులతో ప్రత్యేకంగా హారతులు సమర్పించారు.అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక ఆరాధనలో పూర్తిచేసి అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. అనంతరం విశేష ప్రసాద నివేదనలు పలు రకాల పిండి వంటలు, కాయం, వెన్న, పాలు, పెరుగు తదితర విశేష నివేదనలు సమర్పించారు.అనంతరం నీరాజన మంత్రపుష్పాలు తీర్థ గోష్టి భక్తులందరూ విశేష ప్రసాద్ నివేదనలు పూర్తి చేశారు.కృష్ణాష్టమి విశేష పర్వదిన సందర్భంగా కొండపై గల మూలవిరాట్ కు రాత్రి ఎనిమిది గంటలకు ఆలయ అర్చకులు సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు.కృష్ణాష్టమి ఉత్సవంలో భాగంగా వివిధ రకాల పండ్లు కాయలతో పాలవెల్లి అలంకరణ చేశారు.దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంపై వేంచేపు చేసి ఆలయ అవరణలో ఉట్ల పండుగ సంబరాన్ని నిర్వహించడంజరుగుతుందని ప్రధాన అర్చకుడు వరప్రసాద్ ఆచార్యులు చెప్పారు.నిజ శ్రావణమాసం నాలుగవ శుక్రవారం కూడా కావడంతో గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను పెద్దపల్లకీలో వేంచేపు చేసి స్వామి వారితో పాటుగా గ్రామ తెలివితే సేవ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అర్చకులు పీసపాటి వెంకట శేషాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, ఇల్లింద వెంకట గోపాలచార్యులు, నండూరి వెంకట అప్పల రంగాచార్యులు దేవస్థానం సిబ్బంది గురవయ్య, గ్రామానికి చెందిన ఎన్ వి రాజగోపాల్ ఆచార్యులు, సింగరాచార్యులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# బీసీలకు కేంద్రంలో ఓబీసీ రిజర్వేషన్ల సాధనకై ఎంపీ జీవీఎల్ కృషి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గురువారం విశాఖపట్నంలోని కైలాసపురంలో గల సాగరమాల కన్వెన్షన్ హాల్లో బీసీల సామాజిక సాధికారత సదస్సు బిజెపి ఎంపీ జివిఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగింది.

దీనికి ఉత్తరాంధ్రలో గల ప్రముఖ బీసీ కులాలైన తూర్పుకాపు, కళింగ వైశ్య, శిష్టకరణ సొంది కులాలతో పాటు ఇతర అనేక బీసీ కులాల ప్రతినిధులు హాజరవడం జరిగింది.

దీన్లో ప్రధానంగా జివిఎల్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రధానంగా పై నాలుగు కులాల వారు రిజర్వేషన్లు పొందుతున్నప్పటుకీ వారు రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు రిజర్వేషన్ విషయంలో వివక్షకు గురవుతున్నారని ఈ విధంగా వారికి అన్యాయం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

పై నాలుగు కులాలను వీలైనంత త్వరగా కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని ఎన్సీబీసీ చైర్మన్ మరియు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి ముందు తాను ప్రతిపాదించడం జరిగిందని, దానికి అనుగుణమైన ప్రక్రియ ప్రారంభమైంది అని తెలియజేశారు.ఈనెల 13న ఎన్సీబీసీ పై ప్రక్రియకు అనుగుణంగా సమావేశం నిర్వహించనున్నదనీ ఆయన తెలియజేశారు.

ఉత్తరాంధ్రకు చెందిన 26 కులాలను రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వ జాబితా నుంచి రిజర్వేషన్లు పొందనీయకుండా తొలగించడం జరిగిందని ఇది చాలా అన్యాయం అని దీనికి వ్యతిరేకంగా తాను వారందరికీ తిరిగి రిజర్వేషన్లు కల్పించే విషయమై ఎన్సీబీసీకి ఫిర్యాదు చేయనున్నారని ఆయన తెలియజేశారు.

దీనిపై తూర్పుకాపు, కళింగవైశ్య,సొండి మరియు శిష్ట కరణాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే విధంగా అనుగుణ ప్రక్రియ ప్రారంభినందుకుగాను ఆయా సామాజిక వర్గాల ప్రముఖులు జివిఎల్ కు మరోసారి కృతజ్ఞతలు అభినందనలు తెలియచేస్తూ పదిహేను సంవత్సరాలకు పైగా వీరంతా కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చుకై ప్రయత్నిస్తున్నప్పటికీ ఇప్పటికి జీవీఎల్ కృషి వలన ముందడుగు పడి సానుకూల వాతావరణం ఏర్పడటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# హరే కృష్ణ సత్సంగ మందిరం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ చంద్రశేఖర కళ్యాణ మండపంలో హరే కృష్ణ సత్సంగ మందిరం ప్రేమ దాస్ ప్రభూజి, మాతా లావణ్య ఆధ్వర్యంలో జరిగిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలలో మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మందిరం వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం చిన్నారి శ్రీ కృష్ణులు, హరే కృష్ణ సభ్యులతో కలిసి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారభించారు. ఈ సంధర్భంగా కమిటీ సభ్యులు అయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర, టీడీపి సీనియర్ నాయకులు మారిశెట్టి శంకర రావు,తలారి లక్ష్మి ప్రసాద్, సాలాపు మోహన్, మందిరం నిర్వాహకులు ప్రేమ దాస్ ప్రభూజి, మాతా లావణ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


## శ్రద్ధాంజలి



కీ॥శే॥ రావూరి గోపాలరావు,
లేటు శ్రీమతి రావూరి లలిత కుమారి గార్ల
కుమారుడు మరియు
లేటు శ్రీమతి రావూరి విజయకుమారి గారి భర్త,
సీనియర్ జర్నలిస్టు
**శ్రీ రావూరి వెంకట త్రినాధ సత్యనారాయణ (RVT) గారు**
ది.31-08-2023 గురువారం రోజున
పరమపదించినారని తెలియజేయుటకు
చింతిస్తున్నాము. వారి పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

జననం: 06-12-1958, మరణం: 31-08-2023

**కార్యక్రమ వివరాలు**
ది.09-09-2023 శనివారం **ధర్మోధకాలు** - నారదబృందం, కోనేరు వెనుక, భావనారాయణ స్వామి గుడి ఎదురుగా, సర్పవరం, కాకినాడ
ది.10-09-2023 ఆదివారం **సపండీకరణము** మరియు **వైకుంఠ సమారాధన**, బ్రాహ్మణ పిండప్రధాన సత్రం, బ్రహ్మంగారి మఠం ఎదురుగా, వార్ఫ్‌రోడ్, కాకినాడ

**ముఖ్య విజ్ఞప్తి:**
RVT గారి స్నేహితులు, ఆత్మీయులు, బంధువులు పై కార్యక్రమములకు విచ్చేసి అన్న ప్రసాదం స్వీకరించి మా సహోదరుడు RVT గారి ఆత్మకు సంతృప్తిని కలగజేయమని కోరుచున్నాము.

ఇట్లు
**రావూరి సంగమేశ్వర్రావు,** అడ్వకేటు
**శ్రీమతి శ్యామల**
సెల్: 9848266415, 9949413661



Sugar Free
**Fitearly**
నడివయస్కులకు దివ్య శక్తి
**ఫిట్ ఎర్లీ**
थकावट से सत्वर उपसमन
**फिट एर्ली**

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

**మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?**

# దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం
శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్,
వే ప్రోటీన్,
బ్రాహ్మి,
హరితకి,
సీ భక్తారన్,
శొంఠి,
తులసి,
అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కం ~మైన ఫలితాలను ప్రకటించు కోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
**ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179**
ఈ-మెయిల్: surampudi43@gmail.com

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776